ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




అన్నమయ్య

జిల్లా వార్తలు

5

ఆదివారం 1 డిసెంబరు 2024



రైల్వేకోడూరు మండలం కె.బుడుగుంటపల్లెలో అరటి తోటలో నిలిచిన వర్షం నీరు

భారీ వర్షం

- జనజీవనం అస్తవ్యస్తం
- తుఫాన్‌తో మామిడి, బొప్పాయి పంటలకు దెబ్బ
- ఆగిన ఉద్యాన పంటల ఎగుమతులు
- చెరువుల్లోకి చేరుతున్న నీరు
- జలమయమైన రైల్వేకోడూరు ప్రధానదారులు
- భయాందోళనలో లోతట్టు ప్రాంతవాసులు



వర్షానికి రైల్వేకోడూరు పట్టణ ప్రధానదారి జలమయం




వర్షపు నీటితో నిండిన వాగేటికోన మినీ రిజర్వాయర్



మామిడి తోటలోకి చేరిన నీరు

రైల్వేకోడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్‌తో రైల్వేకోడూరులో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మామిడికి వచ్చిన పూతలు పూర్తి స్థాయిలో దెబ్బతి న్నాయి. ముందస్తుగానే మామిడికి మందులు పిచి కారీ చేశామని పెట్టిన పెట్టుబడి వర్షంతో కొట్టు కునిపోయిందని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా అరటి తదితర ఉద్యాన పంటల ఎగుమతి నిలిచిపోయింది. ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. అరటి, బొప్పాయి, మామిడి తోటల్లో నీరు చేరింది. తోటల్లోని చెట్లు ఎక్కడ పడిపోతాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని శెట్టి గుంట చెరువు పూర్తి స్థాయిలో నిండింది. వాగేటికోన మినీ రిజర్వాయర్‌కు నీరు చేరింది. మండలంలోని చాలా చెరువుల్లోకి నీరు చేరినట్లు అధికారులు తెలి పారు. ఉద్యాన పంటల్లోకి నీరు చేరడంతో రైతులు పొలాల గట్లు తెగ్గొడుతున్నారు. భవన నిర్మాణ కార్మి కులు పనులు లేక అవస్థలు పడ్డారు. పాదచారులు ఇక్కట్లు పడ్డారు. దుకాణాల్లోకి వర్షపు నీరు చేరడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. అడ వుల్లో కురిసిన వర్షం నీరు వాగేటికోనకు చేరుతోంది. అక్కడి నుంచి శెట్టిగుంట చెరువులోకి చేరి, కల్లేరు గుండా గుంజనకు చేరుతోంది. రైల్వేకోడూరు మండలంలోని ఎస్.కొత్తపల్లె, ధర్మాపురం, చిన్నలాలా పేట, నరస రాంపురం తదితర లోతట్టు ప్రాంతాల వారిని అధికా రులు అప్రమత్తం చేశారు. వాగేటికోన పొంగితే ప్రమాదం పొంచి ఉంటుందని రైతులు అంటు న్నారు. రైల్వేకోడూరు నుంచి కె.బుడుగుంటపల్లె, సమతానగర్, అయ్యవారిపల్లె, వీపీఆర్ కండ్రిక, దేశె ట్టిపల్లె, కమలానగర్, లక్ష్మీగార్డెన్స్ లక్ష్మీపురం తదితర 17 గ్రామాలకు వెళ్లే రోడ్డు జలమయమైంది. ప్రస్తుతం రైల్వే అండర్‌బ్రిడ్జి పనులు జరుగుతు న్నాయి. దీంతో రోడ్డు దెబ్బతిని ఉంది. అటువైపు వెళ్లే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైల్వేకోడూరులో ఎక్కువ చలిగాలి మొదలైంది. దీంతో వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

శెట్టిగుంట చెరువులోకి చేరిన వర్షం నీరు



ఉద్యాన పంటల ఎగుమతులు ఆగిపోవడంతో నిలిచిన లారీలు





వర్షంతో గుంతలమయమైన పల్లె రోడ్డు

రేకుల షెడ్లు తొలగించకపోతే చర్యలు

- కలెక్టర్ ఆదేశాల మేరకు నోటీసులు జారీ
- 15 రోజుల్లోపు తొలగించకపోతే మేమే తొలగిస్తాం : తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మాట్లాడుతున్న తహసీల్దార్ భాగ్యలత

గాలివీడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ స్థలంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్లను వెంటనే తొలగించకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ భాగ్యలత హెచ్చరిం చారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'ఆక్ర మిస్తాం.. అడిగేవారెవరు' శీర్షికతో ప్రచురిత మైన కథనానికి స్పందించిన తహసీల్దార్ శనివారం ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సర్వే నెంబరు-2266లో నాలుగు రోడ్ల కూడలిలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న వారికి నోటీసులను జారీ చేసినట్లు తెలిపారు. 15 రోజుల్లో ఆక్రమణలు తొలగించని పక్షంలో పోలీ సుల సహకారంతో మేమే తొలగిస్తామని స్పష్టం చేశారు. మండలంలోని ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లు మా దృష్టికి తీసుకువస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. చాలాచోట్ల ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులను తొలగించినట్లు తన దృష్టికి వచ్చిందని, వెంటనే ఆయా స్థానాల్లో యథావిధిగా బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు.

7న మెగా పీటీఎం

- విజయవంతం చేయండి : డీఈవో సుబ్రహ్మణ్యం



పీలేరు ఎంఆర్‌సీలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం

పీలేరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ (పీటీఎం) డిసెంబరు 7వ తేదీ జరుగుతుందని దానిని విజయవంతం చేయాలని డీఈవో సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులను ఆదేశించారు. మెగా పీటీఎం సన్నాహకాల్లో భాగంగా శనివారం ఆయన పీలేరులోని కోటపల్లె బాలుర ఉన్నత పాఠశాల, ఎంఆర్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రాధాన్యతను తెలియజేయడమే కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సాన్నిహిత్యాన్ని ఏర్పరచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మెగా పీటీఎంను నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఆ సమావేశం పండుగలా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు ఆహ్వానం పంపాలని, సమావేశంలో రాజకీయ ప్రసంగాలు లేకుండా పూర్తిగా విద్యపై కేంద్రీకృతం చేయాలన్నారు. ఆయా పాఠశాలల్లో చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉన్న విద్యార్థుల గురించి తెలియజేసి ప్రస్తుత విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం మెగా పీటీఎం నిర్వహణకు చేపట్టాల్సిన విధివిధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు లోకేశ్వరరెడ్డి, పద్మావతమ్మ, హెచ్‌ఎం శివశంకరయ్య, సీఆర్‌పీలు మురళీధర్‌రాజు, మాధవి, అశోక్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ధరలున్నా దగాయేనా..!

- చామంతి రూ.100
- రైతులకు వచ్చేది తక్కువే...
- దళారులదే రాజ్యం..
- ప్రతి ఏటా ఏదో ఒక గడ్డు పరిస్థితి

6



రాయచోటిలో ఆక్రమణలు తొలగిస్తాం

- నిధుల విడుదలలో వివక్ష చూపుతున్నారు : కౌన్సిలర్లు
- సభ్యుల ప్రశ్నలతో ఆగ్రహించిన మంత్రి
- అక్రమ కట్టడాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు
- భూఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- మున్సిపల్ సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొస్తున్న కౌన్సిలర్లు

రాయచోటి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని ఆక్రమణలను తొలగించి ఆక్రమణదారులను చర్యలు తీసుకుంటామని, నిధుల విడుదలలో ఎలాంటి కక్ష సాధింపులు జరగలేదని, రాయచోటి అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాయచోటి మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా అధ్యక్షతన శనివారం జరిగింది. నిధులను అన్ని వార్డులకు సక్రమంగా కేటాయించలేదని, కక్ష సాధింపులు చేస్తున్నారని, పట్టణంలోని పలుచోట్ల అక్రమ కట్టడాలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ కొంత మంది సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఆగ్రహించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తాము ఎక్కడ గాని అక్రమంగా కట్టడాల విషయంలో గానీ, ప్రభుత్వ భూముల ఆక్రమణ విషయంలో గానీ అధికారులకు ఫోన్లు చేసి చెప్పిన దాఖలాలు లేవని, కక్ష సాధింపు చర్యలు చేపట్టాల్సిన అవసరం మాకు లేదని, రాయచోటి అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. గతంలో మీరు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు అక్రమ కట్టడాలను తొలగించలేదో చెప్పాలని వైసీపీకి చెందిన కౌన్సిలర్లను ప్రశ్నించారు. పాలకవర్గం మీదే ఉన్నప్పటికీ కక్ష సాధింపని మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. రాయచోటి పట్టణంలో గతంలో అక్రమ కట్టడాలు ఎక్కువగా జరిగాయని, అవన్నీ వెంటనే తొలగించాలని మంత్రి అక్కడి నుంచే కలెక్టర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇక నుంచి పట్టణంలో అక్రమంగా కట్టడాలు నిర్మిస్తే సహించేది లేదన్నారు. రాయచోటి పట్టణంలో చాలామంది రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం చేయమన్నారు. గతంలో భూఆక్రమణలు అధికంగా జరిగాయని, భూఆక్రమదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. పులివెందులలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల తరహాలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసి క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా రాయచోటి పట్టణంలో ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, మున్సిపల్ డీఈ నాయక్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ లక్ష్మి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆ చర్చిది 137 ఏళ్ల ఘన చరిత్ర

- 2, 3 తేదీల్లో పరిపేతురు, పరిపాలు చర్చి వార్షికోత్సవం

6

విజయవంతంగా ముగిసిన స్పోర్ట్స్ మీట్

- టగ్ ఆఫ్ వార్ విజేత ఎస్పీ జట్టు
- విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ అందజేసిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

6

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య


సంబేపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో వచ్చే విష జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎన్.కొండయ్య తెలిపారు. శనివారం దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అడవికమ్మపల్లిలో ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాం 104 మెడికల్ క్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రజల దగ్గరికే వైద్య సేవల్లో భాగంగా అడవికమ్మపల్లిలో 104 ప్రోగ్రాంను ఏర్పాటు చేశారని, అన్ని వైద్య సేవలు, రక్తపరీక్షలు ఇక్కడ ఉచితంగా లభిస్తాయని తెలిపారు. అడవికమ్మపల్లెలో పర్యటిస్తూ గతంలో జ్వరం వచ్చి తగ్గిన వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. శీతాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చిరంజీవిరెడ్డి, సీహెచ్‌వో నారాయణ, సబ్‌యూనిట్ ఆఫీసర్స్ వై. ప్రసాద్‌యాదవ్, జయరామయ్య, వైద్య సిబ్బంది కరీముల్లా, సుమతి, ఆశాలు అరుణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.




మెడికల్ క్యాంపును తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

అవినీతి ఎవరిదంటే..

- ఎమ్మెల్యే వర్సెస్ తహసీల్దార్
- ఒకరిపై ఒకరు ఆరోపణలు.. ప్రత్యారోపణలు
- మరోసారి వార్తల్లోకెక్కిన మదనపల్లె



మంత్రి నారా లోకేశ్‌కు తహసీల్దార్ ఖాజాబీ ఇచ్చిన ఫిర్యాదు కాపీ



మదనపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ఏ సంఘటన జరిగినా సంచలనమే.. వివాదమే.. నాడు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఫైళ్ల దహనం నుంచి నేడు ఎమ్మెల్యే, తహసీల్దార్ ఫిర్యాదుల పర్వం వరకూ మదనపల్లె తరచూ వార్తల్లోకి ఎక్కుతోంది. ఇటు రాజకీయ, ఇటు రెవెన్యూ అధికారుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఈ అంశంపై అసలేం జరిగింది అంటే.. ఎవరి వాదన వారిదే అన్నట్లుగా మారింది. తహసీల్దార్ కె.ఖాజాబీ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా ఇటీవల కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేయడం సంచలనం సృష్టించింది. అందుకు ప్రతిగా తహసీల్దార్, ఎమ్మెల్యేపై మంత్రి నారా లోకేశ్‌కు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో రాజకీయ, అధికార వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

1.80 ఎకరాలు తన మనుషులకు ఇవ్వాలన్నారు : తహసీల్దార్

"మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తన మనుషులకు 1.80 ఎకరాల భూమిని రెండు సెంట్ల చొప్పు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు. నిబంధనలు ఒప్పుకోవన్నా వినడం లేదు" అని మదనపల్లె తహసీల్దార్ ఖాజాబీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె శుక్రవారం నారావారిపల్లెలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న మేరకు..

"నేను మూడు నెలలుగా మదనపల్లె తహసీల్దార్‌గా పనిచేస్తున్నాను. మా ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, నా ఉద్యోగానికి ఇబ్బంది కలిగే పనులు చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. రూల్ ప్రకారం అన్నీ కరెక్ట్‌గా ఉండి మ్యుటేషన్ చేసినా ఎవరిని అడిగి చేశావని బెదిరిస్తున్నారు. ఇందులో భాగంగా నవంబరు 25న సోమవారం ఎమ్మెల్యే వారి ఇంటికి నన్ను పిలిపించి మదనపల్లె మండలం బసినికొండ రెవెన్యూ గ్రామం సర్వేనంబర్ 718-8ఏ, 774-3, 510-1ఏ, 2, వెంకప్పకోట సర్వేనంబర్ 71-2 ఎవరిని అడిగి మ్యుటేషన్ చేశావు.. నాకు చెప్పకుండా ఎందుకు చేశావు.. ఇప్పుడే లీవు పెట్టి వెళ్లిపో, లేదంటే కలెక్టర్‌కు చెప్పి సస్పెండ్ చేయిస్తా అని బెదిరించారు.

అలాగే పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి ఆఫీసుకు వెళ్తే, ఎమ్మెల్యే పీఏలు ఖాజా, తిరుపాల్‌నాయక్ ఫోన్‌చేసి ఆఫీసుకు రావద్దంటున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే, మరోసారి వారి కార్యాలయానికి నన్ను పిలిపించి బెదిరించారు.

మరోవైపు కోళ్లబైలు రెవెన్యూ గ్రామం సర్వేనంబర్ 965-5, 595లో 1.80 ఎకరాల భూమిని రెండుసెంట్ల చొప్పున వాళ్ల మనుషులకు పట్టాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం పట్టాలు ఇచ్చే ఆప్షన్ లేదని చెప్పినా ఎమ్మెల్యే వినడం లేదు. ఇలా బీకే పల్లె, వలస పల్లె, బసినికొండ, కోళ్లబైలు, పొన్నేటిపాళెం గ్రామాల్లో ఎమ్మెల్యేకు తెలియకుండా ఏ పని చేయకూడదని ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో ఇప్పటి వరకూ ఆ గ్రామాల్లో 22ఏ, చుక్కల భూములు, కన్వర్షన్, మ్యుటేషన్ ఏవీ జరగలేదు.

హెచ్‌డీటీ అస్లాంని ఎమ్మెల్యే తన గుప్పిట్లో పెట్టుకుని క్లియర్‌గా ఉండీ, వీఆర్వో, ఆర్ఐ రిపోర్టు ఇచ్చిన వాటిని కూడా తహసీల్దార్ కార్యాలయం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి పంపలేదు. కార్యాలయంలో నన్ను రోజువారి విధులు చేసుకోనివ్వకుండా తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటి వరకూ నేను ఎలాంటి తప్పులు చేయకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా అన్ని పనులు సక్రమంగా చేస్తున్నా.. అయినా నన్ను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఎమ్మెల్యే, ఉద్యోగులను ఇబ్బంది పెట్టకుండా మా పనులు మమ్మల్ని చేసుకునేలా, మా పనులకు ఆటంకం కలగకుండా ఉండేలా చూడండి. విధి నిర్వహణలో మాకు ఇబ్బందులు ఎదురవుతున్నా తట్టుకుని ప్రజా సమస్యలు పరిష్కరిస్తుండటంతో జిల్లాలోనే మదనపల్లె మండలం పీజీఆర్ఎస్‌లో అగ్రస్థానంలో ఉంది. కాబట్టి సార్, మదనపల్లె తహసీల్దార్‌గా నాపై ఎవరి ఒత్తిడి లేకుండా నా విధులు నిర్వహించడానికి అవకాశం కల్పించాలని వేడుకుంటున్నా. నేను ఎలాంటి తప్పు చేసినా మీరు విధించే శిక్షను స్వీకరిస్తా." అంటూ తహసీల్దార్ ఖాజాబీ, మంత్రి నారా లోకేశ్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్సీనే లంచం అడిగారు

- తహసీల్దార్‌పై ఎమ్మెల్యే ఆరోపణలు

"మదనపల్లె తహసీల్దార్ ఖాజాబీ 37 సెంట్లకు పాసుపుస్తకం ఇచ్చేందుకు మాజీ ఎమ్మెల్సీనే లంచం అడిగారు. దీనిపై ప్రశ్నించినందుకే నాపై ఆరోపణలు చేస్తున్నారు. ఆమె అవినీతిపై కలెక్టర్‌కు నేను ఫిర్యాదు చేస్తే.. నాపైనే ఆరోపణలు చేయడం సమంజసం కాదు" అని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. తహసీల్దార్ తనపై మంత్రికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే శనివారం మీడియాతో మాట్లాడారు.

"ప్రజాసమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నా. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఆయాశాఖల అధికారులకు సూచనలిస్తున్నా. నేను అసెంబ్లీలో ఉన్నప్పుడు మాజీ ఎమ్మెల్సీ బి.నరేశ్‌కుమార్‌రెడ్డి నాకు ఫోన్ చేసి తహసీల్దార్ అవినీతిపై ఫిర్యాదు చేశారు. నరేశ్‌కుమార్‌రెడ్డికి చెందిన 37 సెంట్ల భూమికి పాసుపుస్తకం ఇచ్చేందుకు తహసీల్దార్ రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశారని ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్సీనే లంచం అడగటంపై తహసీల్దార్‌ను ప్రశ్నించడంతోపాటు వీఆర్‌వోలను పిలిచి విచారించాను. వీఆర్‌వోల ద్వారా తహసీల్దార్ ఫోన్‌పేల ద్వారా డబ్బులు వసూలు చేశారు. ఈ విషయమై తహసీల్దార్‌ను సెలవుపై వెళ్లిపోవాలని సూచించాం. కానీ కొంతమంది టీడీపీ నాయకులు తహసీల్దార్‌ను మంత్రి లోకేశ్ వద్దకు తీసుకుని వెళ్లి ఆమెతో నాపై ఆరోపణల చేయించారు. కొంత మంది రాజకీయంగా లబ్ధిపొందేందుకే అవినీతి అధికారులను ప్రోత్సహిస్తున్నారు. సీఎం చంద్రబాబును, మంత్రి లోకేశ్‌ను తప్పుదారి పట్టించేందుకే ఇలా చేశారు. దీనిపై రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లా. క్రమశిక్షణ గల టీడీపీలో విచారించి తప్పు చేసిన వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరా. నియోజకవర్గంలో ఏ అధికారి అయినా లంచం అడిగితే ప్రజలు నాకు ఫిర్యాదు చేయొచ్చు. ఇందుకోసం టోల్‌ఫ్రీ నెంబర్ 79956 99097 ఏర్పాటు చేశాం. అవినీతిపై పోరాటానికి ప్రజలు సహకరించాలి" అని ఎమ్మెల్యే కోరారు.



మదనపల్లెలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

- చామంతి రూ.100
- రైతులకు వచ్చేది తక్కువే...
- దళారులదే రాజ్యం..
- ప్రతి ఏటా ఏదో ఒక గడ్డు పరిస్థితి

ధరలున్నా దగాయేనా..!

వాల్మీకిపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పూల సాగుతో కష్టాల నుంచి గట్టెక్కవచ్చని ఎంతో ఆశతో సాగు చేసిన రైతు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాడు. మార్కెట్‌లో పూల ధరలు బాగా ఉన్న దళారులే సంపాదిస్తున్నారు కానీ రైతుకు మాత్రం లాభాలు రావడం లేదని వాపోతున్నారు. వాల్మీకిపురం మండల వ్యాప్తంగా ప్రతి ఏటా వందెకరాలకు పైగా సాగు చేసే పూల తోటలు నేడు సగానికి తగ్గాయి. మండలంలో దాదాపు 50 ఎకరాలలో చామంతి పూల తోటలు సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో చామంతి పూలకు బాగా గిరాకీ ఉన్నా ధరలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన రైతు నరసింహులు ఎకరం పొలంలో రూ.లక్షకు పైగా పెట్టుబడితో చామంతి పూల తోటను సాగు చేశాడు. అలాగే వాల్మీకిపురానికి చెందిన శేషాద్రి తులసీరామ్ అనే రైతు అరెకరం పొలంలో రూ.60 వేలు పెట్టుబడితో పింక్, వైట్ చామంతి పూల తోటలు సాగు చేశాడు. మండలంలో సాగు చేసే చామంతి పూలకు బయటి మార్కెట్‌లకు ధరలు బాగానే ఉన్నా రైతుకు మాత్రం దాని ఫలితం దక్కడం లేదు. వాల్మీకిపురం నుంచి మదనపల్లె, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, బెంగళూరు తదితర ప్రాంతాలకు తరలిస్తుంటారు. వారం రోజుల క్రితం వరకు పండుగల నేపథ్యంలో చామంతి పూలకు మంచి గిరాకీ ఉండేది. ప్రస్తుతం బయటి ప్రాంతాల మార్కెట్లలో చామంతి పూలు కిలో రూ.100 వరకు పలుకుతున్నాయి. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న పూల ధరలు అధిక లాభాలు గడించలేకపోయినా అలా ఇలా పెట్టుబడులను రాబట్టుకోగలుగుతున్నామని రైతులు వ్యక్తం చేస్తున్నారు.





వాల్మీకిపురం సమీపంలో సాగు చేసిన వైట్, పింక్ చామంతి పూలతోటలు

ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తే ఏనాడు కూడా రైతులు మంచి లాభాలను గడించిన దాఖలాలు లేవని రైతులు వాపోతున్నారు. రైతుల పంటలను మార్కెట్‌లకు చేరవేసే దశలో దళారుల రాజ్యం ఎక్కువవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లలో ఉండే ధరలలో కనీసం 70 శాతం రైతులకు చేరితే తమ శ్రమకు తగ్గ ఫలితం చూడగలుగుతామని చెబుతున్నారు.

పెట్టుబడులు రాబట్టుకుంటున్నాం..



రెండేళ్ల కాలంలో చామంతి పూల తోటల సాగులో పూర్తిగా నష్టాలనే చూశాం. ఈ ఏడాది కష్టకాలంలో శ్రమించి సాగు చేసిన చామంతి పూలకు కాసింత ఊరటనిచ్చే ధరలే ఉన్నాయి. పంటలకు అధిక లాభాలు రాకపోయినా రైతు పెట్టిన పెట్టుబడులు రాబట్టుకోవడం కాసింత సంతోషమే. రైతులు పండించే పంటలకు పూర్తి మద్దతు ధరలు పలకడం, ఆశించిన ఫలితాలు వస్తే అంతకన్నా సంతోషం ఇంకేముంటుంది. మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న ధరలు ఇలాగే అయినా కొనసాగితే బాగుపడతాం.

-నరసింహులు, రైతు, అయ్యవారిపల్లె

లాభాలు లేవు



నేటి గడ్డు పరిస్థితులలో రైతులు పండించే పంటలకు ఆశించే స్థాయిలో లాభాలను చూడలేకపోతున్నాం. ఈ ఏడాది తొలిసారి అరెకరంలో చామంతి రకాల పూల తోటలు సాగు చేశా. కూలీలు భారం అయినప్పటికీ పెట్టిన పెట్టుబడులు అయినా వస్తాయన్న ఆశతో ఉన్నాం. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు ఉన్నప్పుడే వ్యవసాయంలో ముందుకెళ్లగలం. ప్రభుత్వం కూడా దళారుల పాత్రపై దృష్టి పెట్టాలి.

-శేషాద్రి తులసీరామ్, రైతు, వాల్మీకిపురం.

కష్టకాలంలో సాగు చేసిన పంట చేతికొచ్చే సమయాన కోత కూలీలు భారంగా మారుతున్నాయి. వీటిని అధిగమించాలంటే రైతు సాగు చేసే పంటలకు మంచి ధరలు పలకాలి.

పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి మున్సిపాలిటీ పరిధిలోని రాయుడుకాలనీలో లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు డబ్బు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ లక్ష్యసాధన దిశగా ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అర్హులకు అందజేసి వారికి సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని కల్పించడం జరిగిందన్నారు. కుల, మత పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అర్హులకు అందజేయడం జరుగుతోందన్నారు. గతంలో పింఛన్‌దారులు 1వ తేదీ పింఛన్ తీసుకోకపోతే ఆ పింఛన్ క్యాన్సిల్ చేసేవారని, నేడు ప్రభుత్వం రెండు, మూడు నెలలైనా లబ్ధిదారులకు పింఛన్ మొత్తం కలిపి ఇవ్వడం జరుగుతోందన్నారు. అలాగే అభివృద్ధిలో వెనుకబడి ఉన్న రాయచోటి ప్రాంతాన్ని నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రామాలయంలో పూజలు చేసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

యువజనోత్సవం విజేతలు వీరే

బహుమతులు ప్రదానం చేసిన స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శంకర్




బహుమతులు అందజేస్తున్న రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శంకర్

రామాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పేరును జాతీయ స్థాయిలో నిలబెట్టాలని రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ సూచించారు. బిట్స్ కాలేజీలో శనివారం జరిగిన జిల్లా స్థాయి యువజనోత్సవాల విజేతలను ఆయన అభినందించారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవ్‌లో పెయింటింగ్ విభాగంలో మొదటి బహుమతి వెన్నెల, రెండవ బహుమతి కేబీ స్రవంతి, మూడవ బహుమతి కె.రెడ్డిఇషాంత్, కవిత్వం విభాగంలో మొదటి బహుమతి పి.సమీరాఖానం, రెండవ బహుమతి కె.కార్తీక, మూడవ బహుమతి వి.నిఖిత సాధించారు. అలాగే మొబైల్ ఫొటోగ్రఫీ విభాగంలో మొదటి బహుమతి సి.సాయికిరణ్‌రెడ్డి, రెండవ బహుమతి పి.గౌతమి, మూడవ బహుమతి ఎస్.రితికారెడ్డి, సైన్స్ ఎగ్జిబిషన్ గ్రూప్ విభాగంలో మొదటి బహుమతి రూప టీం, రెండవ బహుమతి లక్ష్మినాథ్‌శర్మ టీం, మూడవ బహుమతి సి.తరుణ్‌కుమార్ గౌడ్ టీం సాధించింది. వ్యక్తిగత విభాగంలో మొదటి బహుమతి కేవీఎంఎస్ యశ్వంత్, రెండవ బహుమతి సిద్దేశ్వర్, మూడవ బహుమతి గురుచరణ్ రెడ్డి, కల్చరల్ ఫెస్టివల్‌లో మొదటి బహుమతి మదనపల్లెకు చెందిన జ్ఞానాంబిక కాలేజీ లంబాడీ టీం, రెండవ బహుమతి జ్ఞానాంబిక కాలేజీకి చెందిన కోయ టీం, మూడవ బహుమతి రాయచోటి మోడల్ కాలేజీకి చెందిన వైశాలీ టీం గెలుపొందింది. విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపిక, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్ అందజేశారు. ముగింపు కార్యక్రమంలో యువ అధికారి మణికంఠ, స్టెప్ సీఈవో సాయిగ్రేస్, భాస్కర్ కాలేజ్ కరస్పాండెంట్ భాస్కర్, ప్రిన్సిపాల్ ఏసీఎస్ రెడ్డి, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ మురళీనాయక్, పెద్దఎత్తున యువత స్టెప్ సిబ్బంది, నెహ్రూ యువకేంద్ర వలంటీర్లు పాల్గొన్నారు.

బైకుల దొంగ అరెస్టు

ఎనిమిది బైకులు స్వాధీనం



బైకుల దొంగను అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ పోలీసులు

మదనపల్లె అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణ పరిసర ప్రాంతాల్లో బైకుల దొంగతనానికి పాల్పడిన దొంగను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరిసావల్లి తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల వివరాలు వెల్లడించారు. మదనపల్లె పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన సయ్యద్ అబ్దుల్ (48) స్థానిక ఉర్దూ స్కూల్ ఎదుట చెప్పుల దుకాణం నిర్వహిస్తున్నాడు.

దీంతో పాటు అతడు బైకుల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో వెంటనే అతడిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 2.50 లక్షల విలువ చేసే 8 బైకులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడికి వైద్య పరీక్షలు నిర్వహించి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఇందులో వన్‌టౌన్ ఎస్ఐ అన్సర్‌బాషా, పోలీసులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక




గాలివీడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎగువ గొట్టివీడు జిల్లా పరిషత్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి పి.బాలగంగాధర్ నాయుడు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-14 విభాగంలో పూతలపట్టులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. .

నీలకంఠ్రావుపేట విద్యార్థి...



రామాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి నాగచైతన్య జాతీయ త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. చిత్తూరు జిల్లా పూతలపట్టులో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి త్రోబాల్ అండర్-14 బాలుర విభాగంలో మంచి ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ తెలిపారు.

ఆ చర్చిది 137 ఏళ్ల ఘన చరిత్ర







137 సంవత్సరాల పురాతన పరిపేతురు, పరిపొలు చర్చి - ఇటుకలతో నిర్మించిన చర్చి ముందుభాగం - చర్చి లోపల భాగం

- 2, 3 తేదీల్లో పరిపేతురు, పరిపొలు చర్చి వార్షికోత్సవం

కలసపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కలసపాడు సగిలేరు నది ఒడ్డున 19వ శతాబ్దంలో ఆంగ్లేయులు నిర్మించిన పురాతన చర్చికి వచ్చిన కోరికలు కోరుకుంటే అవి తీరుతాయని భక్తుల నమ్మకం. 137 సంవత్సరాల చరిత్ర కలిగిన చర్చి వార్షికోత్సవం డిసెంబరు 2, 3వ తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నారు. వేలాదిమంది క్రైస్తవులు హాజరయ్యే తిరుణాలకు చర్చి కమిటీ ఏర్పాట్లు చేస్తుండగా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు.

19వ శతాబ్దంలో చర్చి నిర్మాణం..

19వ శతాబ్దంలో ఇంగ్లాండు నుంచి ఎస్పీజీ మిషనరీలు కలసపాడుకు వచ్చారు. పేద పిల్లల కోసం ఎస్‌పీజీ పాఠశాల ఏర్పాటు చేసి 1884వ సంవత్సరం రెవరెండ్ క్యానమ్ ఆర్థర్ ఇన్‌మన్ చర్చి నిర్మాణానికి పునాది వేశారు. 1887 నాటికి పూర్తి చేసి అప్పటి చెన్నపట్నం నాలుగో బిషప్ రైట్ రెవరెండ్ హెడ్రిక్‌చే ప్రతిష్ఠ నిర్వహించారు. చర్చికి పరిపేతురు, పరిపొలు ఆలయంగా నామకరణం చేశారు. అప్పటి నుంచి ప్రతి యేటా డిసెంబరు 2, 3 తేదీల్లో ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

అద్భుత నిర్మాణం..

కలసపాడు చర్చి నిర్మాణం అద్భుతంగా జరిగింది. స్థానికంగా దొరికే బంకమట్టితో ఇటుకలు తయారు చేసి వాటిని సగిలేరు నదిలో నానబెట్టారు. గట్టిగా ఉన్న ఇటుకలతో పాటు బెల్లం, కోడిగుడ్లు, సున్నం గచ్చులతో యు ఆకారంలో శిలువ గుర్తు వచ్చే విధంగా చర్చి నిర్మాణం చేపట్టారు. చర్చికి ఇరువైపులా వరండాపై చెక్కుచెదరని టేకు దూలాలు ఏర్పాటు చేసి మట్టితో తయారు చేసిన పెంకులను పైకప్పుగా వినియోగించారు. 137 సంవత్సరాలైనా ఏమాత్రం చెక్కుచెదరక భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

భారీగా ఏర్పాట్లు...

చర్చి తిరుణాలకు దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది హాజరుకానున్నారు. అంతేకాక ఈ తిరుణాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తల నీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. మైదుకూరు, బద్వేలు, గిద్దలూరు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేయనుంది.

కార్యక్రమాలు..

2వ తేదీ సాయంత్రం విదేశాల నుంచి వచ్చే అతిథులతో పాటు నంద్యాల డయాసిస్ బిషప్ ప్రముఖులకు స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ఊరేగింపు నిర్వహించనున్నారు. 8.30 గంటలకు దీపారాధన, 9.30కు కానుకలు సమర్పించడం, 11.30 గంటలకు ధనవంతుడు-బీదలాజరు నాటకంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

3వ తేదీ ఉదయం 4 గంటలకు ఆరాధన, 7 గంటలకు గుడి ప్రదర్శన, 9 గంటలకు బాప్తిస్మములు, సాయంత్రం 4 గంటలకు ప్రతిష్ఠ ప్రత్యేక పండుగ కార్యక్రమం నిర్వహించనున్నారు.

గండికోటలో గొడవ .. కారు అద్దాలు ధ్వంసం

జమ్మలమడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోటలో గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు ధ్వంసం చేశారని బాధితుడు హైదరాబాద్ వాసి శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు అందించిన వివరాల్లోకెళితే... గండికోట చూసేందుకు హైదరాబాదు నుంచి కారులో నలుగురు వచ్చారు. వారు శనివారం ఉదయం గండికోటలోని జుమ్మా మసీదు, ధాన్యాగారం, లోయ, మాధవరాయస్వామి దేవాలయం చూశారు. లోయకు సమీపంలో అనుమతి లేకుండా వేసిన లేని టెంట్ల వద్ద కొందరు మాటా మాట పెరిగి గొడవకు దిగారు. అయితే గొడవపడిన వారు సమీపంలో ఉన్న నల్లకారును చూసి కారు అద్దాలు ధ్వంసం చేశారని బాధితులు వివరించారు. కాగా గొడవతో అసలు సంబంధంలేని హైదరాబాదీల కారు అద్దాలు ధ్వంసం చేయడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గండికోటలో అనధికారిక టెంట్లు వేయడం తగదని వారు ఆరోపించారు. ఇతరులకు గొడవ జరిగితే గొడవకు సంబంధంలేని తమ కారు అద్దాలు ధ్వంసం చేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గొడవ విషయమై జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆంధ్రజ్యోతికి వివరణ ఇస్తూ అనధికారికంగా వేసిన టెంట్లపై, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే కారు అద్దాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

ఏపీఆర్‌జేసీ రాష్ట్ర స్థాయి పోటీల్లో

జిల్లా క్రీడాకారుల ప్రతిభ

పెదవేగి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల (ఏపీఆర్ జేసీ) రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. రాష్ట్రంలోని నాలుగు జోన్ల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ పరిధిలో విశేష ప్రతిభతో పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయస్థానం సాధించిన విజేతలు తదుపరి జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రస్థాయి జట్లకు ఎంపికవుతారని పెదవేగి గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. కబడ్డీలో లక్కిరెడ్డిపల్లి బాలికల జట్టు, జోన్-4, ప్రథమ, భీమిలి జట్టు జోన్-1 ద్వితీయస్థానం సాధించారు. అలాగే బాలికల కబడ్డీ సీనియర్స్ విభాగంలో లక్కిరెడ్డిపల్లి జట్టు జోన్-4 ప్రథమ, సంఘం జట్టు జోన్-3 ద్వితీయస్థానం సాధించారు.

విజయవంతంగా ముగిసిన స్పోర్ట్స్ మీట్

- టగ్ ఆఫ్ వార్ విజేత ఎస్పీ జట్టు
- విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ అందజేసిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



పోలీస్ స్పోర్ట్స్ మీట్స్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో మూడు రోజులుగా నిర్వహించిన పోలీస్ వార్షిక గేమ్స్, స్పోర్ట్స్ మీట్ శుక్రవారం రాత్రి ముగిశాయి. ఈ వేడుకలకు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మూడు రోజులుగా నిర్వహించిన క్రీడా పోటీల్లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లను ఎస్పీ ఆసక్తిగా తిలకించారు. టగ్ ఆఫ్ వార్‌లో ఎస్పీ జట్టు విజయం సాధించింది. టగ్ ఆఫ్ వార్‌లో ఎస్పీ కూడా పాల్గొని క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం మూడు పోలీసు సబ్ డివిజన్లు, రాయచోటి, మదనపల్లె, రాజంపేట, ఆర్మ్‌డ్ రిజర్వు నుంచి పాల్గొన్న పోలీసు క్రీడాకారులు ముగింపు మార్చ్ ఫాస్ట్ చేసి ఎస్పీకి గౌరవ వందనం చేశారు. పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో వ్యక్తిగత ఛాంపియన్‌గా ఏఆర్‌పీసీ శ్రీనునాయక్ నిలిచారు. ఓవరాల్ ఛాంపియన్‌గా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు జట్టు నిలిచింది. స్పోర్ట్స్ మీట్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు, విజేతలకు ఎస్పీ ట్రోఫీలు, మెడల్, మెమెంటోలు, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసు స్పోర్ట్స్, గేమ్స్ మీట్ పండుగ వాతావరణంలో ఉత్సాహంగా జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిరోజు చురుకుగా విధులు నిర్వర్తించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సాధారణమని, క్రీడా స్ఫూర్తితో ఓటమిని కూడా ఆనందంగా స్వీకరించినప్పుడే జీవితంలో కూడా ఒడిదుడుకులను ఎదుర్కోగలమన్నారు. స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన పోలీసు అధికారులకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లకు, పోలీసు సిబ్బందికి ఎస్పీ మెమెంటోలను అందజేసి అభినందించారు. క్రీడల ముగింపు వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, మదనపల్లి డీఎస్పీ డి.కొండయ్యనాయుడు, రాజంపేట డీఎస్పీ ఎన్.సుధాకర్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, ఫిజికల్ డైరెక్టర్లు, వైద్య బృందం పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో సీఐల బదిలీ

కడప(క్రైం),నవంబరు(ఆంధ్రజ్యోతి)30: ఉమ్మడి కడప జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు తక్షణమే కేటాయించిన స్టేషన్‌లలో రిపోర్టు చేశాయలంటూ ఆదేశాలు జారీ చేశారు.

సీఐ పేరు	పనిచేస్తున్న స్టేషన్	బదిలీ అయిన స్టేషన్
ఎ. చాన్‌బాష	వీఆర్ అన్నమయ్య	డీటీసీ నంద్యాల
జి.ఓబులేష్	ఆత్మకూరు నంద్యాల	కడప చిన్నచౌకు
క్రిష్ణంరాజు నాయక్	ఒంటిమిట్ట	వీఆర్ కడప
నాగరాజు	ఆర్‌కే వ్యాలీ	సోషియల్ మీడియా, సైబర్ సెల్ కడప
టి.బాబు	వీఆర్ కడప	ఒంటిమిట్ట
ఉలసయ్య	వీఆర్ చిత్తూరు	ఆర్‌కే వ్యాలీ
వెంకట కుమార్	ఎస్‌బీ-1 కడప	వీఆర్ కడప
టి.రెడ్డప్ప	వీఆర్ కడప	ఎస్‌బీ-1కడప
సురేంద్రనాథ్ రెడ్డి	వీఆర్ అన్నమయ్య	ఎస్‌బీ-2 కడప
ఈదురు బాష	వీఆర్ కడప	ఎహెచ్‌టీయూ కడప
నరసింహులు	ఆర్‌ఎస్ఎఎస్‌టీఎఫ్, కడప	పులివెందుల
రాజారెడ్డి	బి.కొత్తకోట అన్నమయ్య	ఎస్‌బీ-3 అన్నమయ్య
జీవన్ గంగనాద్‌బాబు	పులివెందుల	బి.కొత్తకోట అన్నమయ్య
టి.మధు	వీఆర్ అన్నమయ్య	ఆర్‌ఎస్ఎఎస్‌టీఎఫ్, అన్నమయ్య
టి.వి.సత్యనారాయణ	ఎస్‌బీ-1అన్నమయ్య	వీఆర్ అన్నమయ్య
రాజా రమేష్	ఎస్‌బీ-3అన్నమయ్య	ఎస్‌బీ-1అన్నమయ్య
జె.శంకరయ్య	డీసీఆర్‌బీ అన్నమయ్య	వీఆర్ అన్నమయ్య
తులసీరామ్	వీఆర్ అనంతపురం	డీసీఆర్‌బీ అన్నమయ్య

నిర్మల ఫార్మశీకి న్యాక్ అనుబంధ గుర్తింపు



ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న కళాశాల చైర్మన్ శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కడపనగరం నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మశీకి ప్రతిష్టాత్మక న్యాక్ అనుబంధ గుర్తింపు వచ్చింది. 2024 విద్యాసంవత్సరం నుంచి 2029 విద్యాసంవత్సరం వరకు ఈ గుర్తింపు వర్తిస్తుందన్నారు. గత జూన్‌లో నాక్ సంస్థ ముగ్గురు నిపుణుల బృందాన్ని పంపించి ఐదేళ్లలో విద్యావిధానం, అడ్మిషన్లు, ఫార్మశీరంగంలో రీసెర్చ్ అండ్ డెవల్‌మెంట్ విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన క్యాంపస్ సెలక్షన్లు సైంటిఫిక్ సెమినార్లు వర్క్‌షాపులు స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, మానసిక శారీరక దృఢత్వానికి అవసరమైన యోగా వివిధ ఆటల పోటీల నిర్వహణ, ఇతర కళాశాలల ఫార్మశీ కంపెనీలతో కలిసి పనిచేసే అవసరమైన అనుబంధ పత్రాలు వీటిపై క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి చెంది న్యాక్ అనుబంధ గుర్తింపు క్రించింది. ఈ విషయంలో కళాశాల యాజమాన్యం బోధన బోధనేతర సిబ్బంది కృషి గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ ఒక ప్రశంసాపత్రాన్ని పంపిందని కళాశాల చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. అనుబంధ గుర్తింపు తీసుకురావడానికి కృషి చేసిన డాక్టర్ మోహనకుమార్, న్యాక్ కోఆర్డినేటరు స్రవంతి, ఉపాధ్యాయులను అభినందించారు.

విదేశీ విద్యపై అవగాహనసదస్సు



విదేశీ విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భూపేంద్ర

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో చదవాలనుకునే విద్యార్థులకు శనివారం ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ కార్యాలయంలో హైదరాబాదుకు చెందిన అబాకర్స్ ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ అడ్వైజర్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా వ్యాప్తంగా 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. నిర్వాహకులు విదేశాల్లో చదువు, కెరీర్, భవిష్యత్తు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విదేశాల్లో ఏయే యూనివర్శిటీల్లో ఏయే కోర్సులు అందుబాటులో ఉన్నాయి, మంచి యూనివర్శిటీలు, రాయాల్సిన పరీక్షలు, వీసా, రుణ సౌకర్యం, సమర్పించాల్సిన డాక్యుమెంట్లపై విద్యార్థులకు వివరించారు. అబాకర్స్ ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ అడ్వైజర్స్ డైరెక్టర్ భూపేంద్ర మాట్లాడుతూ అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ప్రముఖ యూనివర్శిటీల్లో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ మేనేజ్‌మెంట్, బయోటెక్నాలజీ వంటి కోర్సుల్లో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆయా యూనివర్శిటీల్లో చదవడంతో మంచి అవకాశాలు లభిస్తాయని, అలాగే పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసి యూనివర్శిటీ ఫీజులను సొంతంగా చెల్లించుకోవచ్చన్నారు. పోస్ట్ స్టడీ వర్క్ వీసా ద్వారా రెండు మూడేళ్లు ఆ దేశాల్లోనే పనిచేసుకోవచ్చని సూచించారు.

ప్రవచన కర్త పుష్పగిరి క్షేత్ర సందర్శన



ప్రవచనకర్త శ్రీనివాసులును సత్కరిస్తున్న దేవస్థానం సభ్యులు

వల్లూరు/ఖాజీపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రవచన కర్త నండూరి శ్రీనివాస్ శనివారం పుష్పగిరి క్షేత్రంలోని చెన్నకేశవస్వామి వారిని దర్శించుకున్నారు. కార్తీకమాసం ముగుస్తుండడంతో ఆలయంలో మహిళలు కార్తీక దీపాన్ని వెలిగించి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రవచనకర్త శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారి ద్వారా స్వామివారి చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి తదితరులున్నారు.

వర్షం కారణంగా ఆగిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్ నవంబరు30, (ఆంధ్రజ్యోతి): ఏసీఏ మెన్ అండర్- 23 ఇంటర్ జోనల్ వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లు శనివారం వర్షం కారణంగా ఆట మధ్యలోనే నిలిచిపోయాయి. వివరాలిలా...

వైఎస్ రాజారెడ్డి - ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈస్ట్ గోదావరి- రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ బ్యాటింగ్‌కు దిగి 33 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 234 పరుగుల స్కోర్ సాధించింది. కాగా వర్షం రాకతో ఆట నిలిచిపోయింది. కేఎస్ఆర్ఎం మైదానంలో ప్రకాశం- అనంతపురం జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు 41.3 ఓవర్లలో 239 పరుగుల స్కోర్ సాధించి ఆలౌట్ అయింది. తర్వాత వర్షం కారణంగా ఆట నిలిచిపోయే సమయానికి ప్రకాశం జట్టు 14 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 101 పరుగులు చేసింది. కేఓఆర్ఎం మైదానంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్- రెస్ట్ ఆఫ్ నార్త్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్‌నెగ్గిన రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ జట్టు బ్యాటింగ్‌కు దిగి 45 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 186 పరుగులు చేసింది. ఇందులో వి. వర్ధన్ 44 పరుగులు, రాజు 42 పరుగులు చేశారు. అనంతరం వర్షం రాకతో రెస్ట్ ఆఫ్ నార్త్ జట్టు మ్యాచ్ సాగలేదు.

మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామిపై కేసు నమోదు

బద్వేలుటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామిపై పలుసెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె పంచాయితీ 1754/2 సర్వేనెంబర్‌లో జరిగిన భూ అవకతవకలపై లబ్ధిదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

భర్త మృతి చెందిన మూడు రోజులకే...

ప్రమాద వశాత్తు భార్య నాగసుధ మృతి

లింగాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భర్త నాగరాజు మృతి చెందిన మూడు రోజులకే భార్య నాగసుధ(36) మృతి చెందింది. లింగాల ఎస్ఐ మధు సూదన్‌రావ్ అందించిన వివరాల్లోకెళితే... పార్నపల్లె వాసి సాకే నాగరాజు నవంబరు 26న మృతి చెందాడు. అయితే మృతుడి భార్య నాగసుధ భర్త సమాధి వద్దకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపుతప్పి ప్రమాద వశాత్తూ కింద పడింది. దీంతో నాగసుధకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వెంటాడిన మృత్యువు

బైక్, ట్యాంకర్ ఢీ - లెక్చరర్ దుర్మరణం



మల్లికార్జున రాజు మృతదేహం - (ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో)

ఎర్రగుంట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మరో 15నిమిషాల్లో గమ్యాన్ని చేరబోతుండగా మృత్యువు సిమెంట్ ట్యాంకర్ రూపంలో వెంటాడి తన ఒడికి చేర్చుకుందని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. లెక్చరర్ డాక్టర్ బి.మల్లికార్జునరాజు వెళుతున్న బైక్‌ను ట్యాంకర్ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వివరాల్లోకెళ్లితే....

ప్రొద్దుటూరు మండలం శంకరాపురం వాసి డాక్టర్ బి.మల్లికార్జునరాజు ఎర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడేళ్లుగా తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఈయన ప్రొద్దుటూరులో కాపురం ఉంటూ ఎర్రగుంట్లలోని కళాశాలకు వచ్చి విధులు నిర్వహించి వెళ్లేవారు. శనివారం ఉదయం కాలేజికి మొటార్‌బైక్‌లో బయలుదేరాడు. మరో 10నిమిషాల్లో గమ్యాన్ని చేరుకునే సమయంలో ప్రొద్దుటూరు పెన్నా వంతెన దిగగానే పోట్లదుర్తి నడిగడ్డ శివాలయం మలుపు వద్ద అదేవైపు నుంచి వస్తున్న ట్యాంకర్ ఢీకొంది. దీంతో మల్లికార్జునరాజు ట్యాంకర్ కిందపడడంతో ఆయన మెడపై టైర్లు ఎక్కడంతో టైర్ల మధ్యలో ఇరుక్కుపోయాడు. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎర్రగుంట్ల సీఐ నరేష్ బాబు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీశారు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

దిగ్భ్రాంతికి లోనైన సిబ్బంది

ఎర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ మల్లికార్జునరాజు సంఘటలన తీవ్రదిగ్భ్రాంతికి లోను చేసిందని ప్రిన్సిపాల్ రవికుమార్ అన్నారు. సిబ్బందితో కలిసి సంఘటనా స్థలిలో మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు. తెలుగు లెక్చరర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా హుషారుగా ఉండేవారన్నారు. అందరిని ఆకట్టుకునే వారని, ఆయన మృతి తమకు తీవ్ర దుఃఖాన్ని మిగిల్చిందన్నారు. మల్లికార్జున అంత్యక్రియలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

బడి వైపు ఒక అడుగు : కలెక్టర్

కడప కలెక్టరేట్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): పిల్లల బంగారు భవిష్యత్తు కోసం... తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బడి వైపు ఒక అడుగు వేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ సభా భవనంలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌పై ఎంఈఓలు, ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యం ఉన్నపుడే ఏ రంగమైనా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర విద్యాభివృద్ధిలోనూ కీలక భాగస్వామి కావాలన్నదే పద్రాన లక్ష్యమన్నారు. పేదరికంలేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా విద్యారంగంలో అనేక సంస్కరణలు పరిశీలించిన ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల మధ్య సంబంధాలు బలపరిస్తే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెంది 2047కు వికసిత ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దాలని సంకల్పించారన్నారు. ఇందులో భాగంగానే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (మెగాపీటీఎం)ని దేశంలోనే ఆదర్శవంతంగా నిర్వహించాలన్నారు. 2009లో భారత ప్రభుత్వం మన పిల్లల కోసం బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం తీసుకు వచ్చారన్నారు. పాఠశాలల పనితీరు మెరుగు పరిచే క్రమంలో స్థానిక ప్రజల భాగస్వామ్యం కల్పించి పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఖచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, సిబ్బందితో సమావేశమై రూపొందించిన నమూనా ఆధారంగా పాఠశాలల్లో మెగా పీటీఎం నిర్వహించడానికి ప్రణాళికను రూపొందించు కోవాలన్నారు. తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, సమాజ సేవకులు దాతలను ఆహ్వానించేందుకు స్వయంగా విద్యార్థుల చేత ఆహ్వాన పత్రికలు సిద్ధం చేయించాలన్నారు. అవసరమైన కార్డులు, పెయింట్స్, కలర్ పెన్సిల్, స్కెచ్ పెన్స్‌ను స్కూల్ హెడ్ సమకూర్చాలన్నారు. జేసీ అదితి సింగ్, జడ్పీసీఈఓ ఓబులమ్మ, మున్సిపల్ కమిషనరు మనోజ్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఇసుక పంపిణీ సజావుగా జరగాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇసుక పంపిణీ పక్రియ సజావుగా జరగాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇసుక బుకింగ్, సరఫరా, లభ్యత అంశాలపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి డీఎల్ఎస్‌సీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ప్రతి స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు నిరంతరం పని చేసేలా చూసుకోవాలన్నారు. ఆర్డీఓలు తమ పరిధి స్టాక్ పాయింట్ రీచ్‌లను తనిఖీ చేసి సమస్యలుంటే పరిష్కరించాలన్నారు. ఇసుక పంపిణీ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యావరణ అనుమతులు పొందిన సిద్దవటం మండలం గుండ్లమూల, చక్రాయపేటలోని గండికోవూరు, వీఎన్ పల్లి మండలం తంగేడు పల్లి మూడు సెమీ మెకనైజ్డ్ ఇసుకరీచులకు నోటిఫికేషన్ ఇచ్చి టెండర్లు పిలిచారన్నారు. వీటికి 13 టెండర్లు అప్లికేషన్లు వచ్చాయన్నారు. ఇందులో 11 అర్హత పొందాయని తెలిపారు. తంగేడు పల్లి ఇసుక రీచ్‌ను అంకిరెడ్డి అండ్ సన్స్ రూ.24.50 బిడ్‌ధరకు దక్కించుకున్నారు. మిగతా రెండు రీచ్‌లకు తక్కువ ధరకు కోడ్ చేసిన వాటికి నోటీసులు ఇచ్చి డీఎల్ఎస్‌సీ కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు.

మట్టి తవ్వకాల్లో బయల్పడిన గుహ?



శివాలయం వద్ద బయల్పడిన గుహ - లోపలి భాగం

కొండాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముచ్చుమర్రి సమీపంలో గుహలు ఉన్నట్లు స్థానికులు భావిస్తున్నారు. శివాలయం పక్కనే ఉన్న కొండలో ప్రొక్లెయిన్‌తో నేషనల్ హైవే పనులకు ఇటీవల బెలుకు మట్టి తీస్తుండగా కొండ వద్ద పెద్ద రంధ్రం బయటపడింది. అయితే లోపల కొద్ది దూరం వరకు వెళ్లి చూస్తే గుహ మాదిరి ఉందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఇవి నిజంగా గుహలేనా లేదా కొండకు పడిన ఒక పెద్ద రంధ్రమా అని సంబంధిత అధికారులు తేల్చాల్సి ఉంది. గుహ లాగా కనిపిస్తున్నా ధైర్యం చేసి ఎవరూ లోపలికి వెళ్లడం లేదు. చుట్టూ బెలుకు మట్టి ఉండడం, మధ్యలో పెద్ద పెద్ద బండలు ఉండడంతో లోపలికి వెళ్లడానికి బయపడుతున్నారు. కాగా గుహ బయట పడిందని తెలియడంతో చూసేందుకు పెద్ద ఎత్తున తరలి జనాలు వస్తున్నారు. శనివారం సాయంత్రం ఈ ప్రాంతాన్ని కొండాపురం తహసీల్దార్ గురప్ప సందర్శించారు. పరిశీలనకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

నేటి ర్యాలీని విజయవంతం చేయాలి : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ, డీఎల్‌టీఓ డాక్టర్ సగిలి రవిబాబు పిలుపు నిచ్చారు. శనివారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ డిసెంబరు1 ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. 'హక్కుల మార్గాన్ని అనుసరించండి - నా ఆరోగ్యం నా హక్కు' నినాదంతో హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు అండగా ఉండాలన్నారు. దుర్వ్యసనాలకు బానిసలవడం, మత్తు పదార్థాలు,సెల్ ఫోన్లలో అశ్లీల చిత్రాలకు ఆకర్షితులై విచక్షణ కోల్పోయి క్షణికావేశంలో సురక్షితం కాని సెక్స్ చేస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితులనుంచి యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్పొరేషన్ నుంచి డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వరకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ చేస్తున్న ర్యాలీని విజయ వంతం చేయాలన్నారు. డిసెంబరు 1 నుంచి 15వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలలు, మహిళా స్వయం సహాయక సంఘాల్లో హెచ్ఐవీ,ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రెండు నెలలకు ఒక సారి ట్రాన్స్ జండర్స్, మేల్ సెక్స్‌వర్కర్లకు నీకు తెలుసా? కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. హెచ్ఐవీ పాజిటివ్ ఉన్న వారికి ప్రభుత్వం ప్రతి నెల రూ.4 వేలు పింఛన్ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, ప్రోగ్రామ్ ఆఫీసరు, సిబ్బంది హాజరయ్యారు.

జీఎస్టీని హెడ్ ఆఫ్ అకౌంట్స్‌కు జమచేయాలి

● అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలి : జీఎస్టీ జాయింట్ కమిషనర్ కల్పన



మాట్లాడుతున్న జీఎస్టీ జాయింట్ కమిషనర్ కల్పన

కడప రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో చేపట్టిన, చేపడుతున్న పనుల నుంచి తగ్గించిన జీఎస్టీ, క్యుసీ, ఎన్ఏసీ, లేబర్ సెస్ మొత్తాన్ని వెంటనే సంబంధిత శాఖల హెడ్‌ఆఫ్‌అకౌంట్స్‌కు జమచేయాలని జీఎస్టీ జాయింట్ కమిషనర్ జి. కల్పన, అసిస్టెంట్ కమిషనర్ ఎస్. రాజా నరసింహారెడ్డి, జడ్పీ సీఈఓ సి. ఓబులమ్మ పేర్కొన్నారు. శనివారం జడ్పీ సమావేశహాలులో ఉమ్మడి కడప జిల్లాలోని 50 మండలాల ఎంపీడీఓలు, పరిపాలనా అధికారులకు జీఎస్టీ చెల్లింపు విధానం, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించిన వారు మాట్లాడుతూ జీఎస్టీ చెల్లింపుపై పూర్తిస్థాయి చర్యలను చేపట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో తగిన పురోగతిని సాధించాలన్నారు. డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా ప్రస్తుతం జరుగుతున్న క్యాటల్ సీడ్స్, సీసీ రోడ్ల పనులకు తగిన ప్రాధాన్యతను కల్పించాలన్నారు. పనిదినాలను మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

'ఎయిడ్స్ నిర్మూలనకు నడుం బిగిద్దాం'



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నిర్మూలనలో నడుం బిగిద్దామంటూ వైవీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ రోగనిరోధకశక్తిని తగ్గిస్తుందన్నారు. రక్తమార్పిడి, కలుషిత సిరంజి, అనైతిక శృంగారంతో ఎయిడ్స్‌వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటరామిరెడ్డి ప్రొఫెసరు క్రిష్ణారావు,డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు వెంకటరమణ, సుమిత్ర, డాక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

సింహాద్రిపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాల కామర్స్ లెక్చరర్ పి. ఖైరున్నీసా మెడలో బంగారు గొలుసు దుండగులు లాక్కెల్లినట్లు పోలీసులు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి సమాచారం మేరకు ఖైరున్నీసా ముద్దనూరు నుంచి రోజూ కళాశాలకు వచ్చి సాయంత్రం ప్రొద్దుటూరు బస్సుకు వెళ్తుండేది. ఈ నేపథ్యంలో శనివారం విధులు పూర్తి చేసుకుని బస్సు కోసం విద్యుత్ సబ్-స్టేషన్ వద్ద మెయిన్ రోడ్డుపై వేచి వుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైకుపై వచ్చి ఆమె మెడలోని 20 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రమాదవశాత్తు టీడీపీ కార్యకర్త మృతి



వీరపునాయునిపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనిమెల టీడీపీ క్రియాశీలక కార్యకర్త బత్తల బ్రహ్మయ్య (37) ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఎస్ఐ మంజునాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం బ్రహ్మయ్య పిల్లవాడి పాఠశాలకు వెల్లాడు. అక్కడ పిల్లవాడి చెప్పులకోసం పాఠశాల మెట్లు ఎక్కుతుండగా జారి వెనక్కి పడ్డాడు. బలమైన గాయమవడంతో చికిత్స కోసం వేంపల్లెకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ఖాజీపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కూనవారిపల్లె పంచాయతీ సీతానగరం వద్ద విద్యుత్తు అర్త్‌వైరు తగిలి గేదె మృతిచెందింది. వివరాల్లోకి వెళ్లితే... కూనవారిపల్లె వాసి గోసుల యల్లారెడ్డి దినచర్యలో భాగంగా పశువులను మేపుకునేందుకు వెళుతుండగా రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ అర్త్‌వైర్‌కు విద్యుత్తు సరఫరా జరిగింది. ఈ తీగె గేదెకు తగిలి మృతి చెందుతుండగా ఏమైందని యజమాని పరిశీలించేందుకు తగలగా విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగి యజమాని కూడా కిందపడ్డాడు. విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యానికి గేదెను కోల్పోవాల్సి వచ్చిందని యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

కాపు రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని మండల నవ్యాంధ్ర కాపుబలిజ సంఘం అధ్యక్షుడు కావలి ఆంజనేయులు కోరారు. 2019లో తెలుగుదేశం ప్రభుత్వంలో ఇచ్చిన జీవోను మళ్లీ అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం అనుమతి అవసరం లేదని, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చని రాజ్యసభలో బీజేపీ ఎంపీ జీవీఎల్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారని ఆయన గుర్తు చేశారు. డిసెంబరు 22న కడపలో నిర్వహించే సమావేశానికి రెండు జిల్లాల బలిజ సంఘం నాయకులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. అందరం కలిసికట్టుగా వెళ్లి తెలుగుదేశం మంత్రులకు విన్నవించుకుందామని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి యనమల విశ్వనాథ తదితరులు పాల్గొన్నారు.

యువ ఉత్సవ్ విజేతలకు డీఈవో అభినందన

రాయచోటిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): యువ ఉత్సవ్-2024 రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు సంబేపల్లె హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన 'ఎకో సేఫ్ విత్ ఆక్వా సేఫ్' ప్రాజెక్టు ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. రాయచోటిలోని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో నిర్వహించిన యువ ఉత్సవ్- 2024 సైన్స్ ఎగ్జిబిషన్‌లో తమ పాఠశాలకు చెందిన తరుణ్‌కుమార్‌గౌడ్, నాగచైతన్యరెడ్డి ప్రదర్శించిన 'ఎకో సేఫ్ విత్ ఆక్వా సేఫ్' ప్రాజెక్టు మూడవ స్థానంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఆయా విద్యార్థులతోపాటు గైడ్ టీచర్ మార్ల ఓబుల్ రెడ్డిని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి శనివారం అభినందించారన్నారు.

పేదల కడుపు నింపేందుకే అన్న క్యాంటీన్లు

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): పేదల కడుపు నింపేందుకే రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ యార్డులో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామన్నారు. గతంలో అన్న క్యాంటీన్లకు ఎంతో ప్రాముఖ్యత ఉండేదని, మళ్లీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేదలు, కూలీల కడుపు నింపడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి క్యాంటీన్ వద్ద పూటకు 400 మంది చొప్పున రోజుకు 1200 మందికి టిఫిన్‌తో పాటు మధ్యాహ్నం, రాత్రిపూట భోజనం ఉంటుందన్నారు. అన్న క్యాంటీన్‌ల కారణంగా నేడు ప్రతి పేదవాడు మూడు పూటలా భోజనం చేసి సుఖ సంతోషాలతో జీవిస్తున్నారన్నారు. ఇక నుంచి రాష్ట్రంలో ఎక్కడా ఆకలి కేకలు ఉండవన్నారు. రాయచోటి పట్టణం లో ప్రస్తుతం రెండు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేద ప్రజల ఆకలి తీరుస్తున్నామన్నారు. గతంలో ఉద్యోగులకు జీతాలు, వృద్ధుల కు పింఛన్లు పంపిణీ చేయాలంటే ఎంతో కష్టంగా ఉండేదని, నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతప్రతి నెల 1వ తేదీ రాకముందే పింఛన్ల పంపిణీ కార్యక్రమం, ఉద్యోగులకు నెలనెలా 1న తేదీన జీతాలు ఇస్తున్నామన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

● నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి


నేతలతో మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటికే లక్ష సభ్యత్వాలు పూర్తి చేసి రాష్ట్రంలో నెంబర్‌వన్‌గా ఉన్న రాజంపేటలో సభ్యత్వ నమోదును మరింత వేగవంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం స్థానిక నేతలతో మాట్లాడుతూ ప్రతి నాయకుడు పోలింగ్ బూత్‌ల వారీగా ప్రతిఒక్కరికీ సభ్యత్వం ఇప్పించాలన్నారు. సభ్యత్వంతో కలిగే ప్రయోజనాలను ఇంటింటికి తెలపడం వల్లే అనతికాలంలోనే లక్ష సభ్యత్వాలను పూర్తి చేశామన్నారు. ఇదే స్ఫూర్తితో నియోజకవర్గవ్యాప్తంగా ప్రతి కార్యకర్త శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు పొందూరు కొండయ్యనాయుడు, సుబ్రమణ్యం నాయుడు, రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి తరిగోపుల సంజీవరావు, పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, అగ్రహారం నాయకులు సుధాకర్, మండల టీడీపీ నాయకులు మేకా నరసింహులు, అత్తిరాల దేవస్థానం మాజీ చైర్మన్ బండారు బాలయ్య, మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

హక్కులతోపాటు బాధ్యతలపై కూడా అవగాహన అవసరం

● స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ డాక్టర్ శంకర్

చిట్వేలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహిళలు తమ హక్కుతో పాటు బాధ్యతలపై కూడా అవగాహన పెంచుకోవాలని రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ డాక్టర్ శంకర్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీపీ సభాభవనంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు మహిళలకు చట్టపరంగా ఉన్న హక్కులు, కుటుంబ విలువలపై ఉపన్యసించారు. తన సంస్కృతి సంప్రదాయాలు, కుటుంబ విలువలను పిల్లలకు తెలియజేసినా చాలావరకు విడాకుల సమస్యలు రావన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, తహసీల్దారు మోహన్‌కృష్ణ, ఎస్‌ఐ రఘురాం, అడ్వకేట్‌లు శ్రీనివాసులు, రమణ, ఈవోపీఆర్డీ శివకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసుంధరమ్మ, ఏపీవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో తహసీల్దార్ శ్రావణి మాట్లాడుతూ మహిళలకు న్యాయపరంగా ఏమైనా సమస్య ఎదురైనపుడు 15100 నెంబర్‌కు కాల్ చేస్తే న్యాయవ్యవస్థ వారిని కాపాడుతుందన్నారు. మహిళలు తమ హక్కులతో పాటు బాధ్యతలను కూడా మర్చిపోకుండా కుటుంబ సభ్యులతో వ్యవహరించాలన్నారు. న్యాయవాది నాగేశ్వరరావు ఎస్‌ఐ మోహన్‌నాయక్, రామచంద్రారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ, హౌసింగ్ ఏఈ వెంకటేశ్, ఏపీఎం ఖాదర్‌వలి, అంగన్వాడీ వర్కర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

రైల్వేకోడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులో కొత్త బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. భాస్కర్‌రెడ్డి శనివారం తెలిపారు. మూడు నెలల కాల పరిమితి ఉన్న ఈ కోర్సులో ప్రవేశానికి ఇంటర్ ఆపైన విద్యార్హత ఉన్న యువతీ యువకులు కళాశాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కో-ఆర్డినేటర్ సునీల్ ఫోన్ నెంబరు 95500 95775లో సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువకులు, యువతుల కోసం స్కిల్ హబ్ సెంటర్‌లో శిక్షణ ఇస్తారని తెలిపారు. జిల్లాలోని వనరులను దృష్టిలో డిమాండు ఉన్న కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి, స్థానికంగా ఉన్న పరిశ్రమలతోపాటు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న పరిశ్రమల్లో ఉపాధి కల్పిస్తామన్నారు.

బోగస్ సర్టిఫికెట్లపై ప్రభుత్వ వైఖరి ప్రకటించాలి

రాయచోటిటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బోగస్ సర్టిఫికెట్ల నిషేధంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు, పారామెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, నాయకులు కందుకూరి రామయ్య, దార్ల శివరామయ్య డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ల (మేల్) నియామకానికి ఏపీ పబ్లిక్ హెల్త్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ ద్వారా బోగస్ సర్టిఫికెట్లకు అనుమతులు పొందడం నేరమన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యా చట్టాలను ఉల్లంఘించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వారు సూచించినా బోగస్ విద్యా సంస్థల మాఫియాను కోర్టు దృష్టికి తీసుకెళ్లడంలో ఉద్దేశ పూర్వకంగానే నిర్లక్ష్యం చేసిన ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలనివారు డిమాండ్ చేశారు. బోగస్ సర్టిఫికెట్ల ముఠాపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్‌యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు.


ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె,నవంబరు 30(ఆంధ్రజ్యోతి); ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. పౌరహక్కుల దినం సందర్భంగా మండలంలోని కస్తూరిరాజుగారిపల్లె దళితవాడలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెల 30న దళిత గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి హక్కులు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు రాజశేఖర్ మాట్లాడుతూ పౌరహక్కులను కాపాడే బాధ్యత ప్రభుత్వాలదేన్నారు. నిమ్నజాతుల వారిని అవమానిస్తే ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం శిక్షార్హులవుతారన్నారు. ఈఓపీఆర్డీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచు నాగిరెడ్డి, ఏఎస్‌ఐ మస్తాన్, డీటీ హరిప్రసాదు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సభ్యత్వం తీసుకోవాలి

రైల్వేకోడూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త సభ్యత్వం పొందాలని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. శనివారం విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాద పూర్వకంగా కలిసి ఆయన చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం చేసుకున్న వారికి ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. టీడీపీ సభ్యత్వాల నమోదుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు.


చంద్రబాబు నుంచి శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న పంతగాని

1 నుంచే రేషన్ పంపిణీ చేయాలి

వీరబల్లి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా 1వ తేదీ నుంచే నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ తిమ్మారెడ్డి సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లు ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి ఎండీయూ ఆపరేటర్ రోజుకు కనీసం 100 కార్డులకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాక్ పాయింట్ నుంచి రేషన్ తీసుకున్న ప్రతి డీలరు సరైన సమయంలో అథెంటికేషన్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన


విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సుండుపల్లె,నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న బేబి కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు జయన్న శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినితో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు రవీంద్రరాజు, రాధారాణిని ఆయన అభినందించారు.

'పన్ను బకాయిలు చెల్లించరా ?'

రాజంపేట టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అన్నమాచార్య యూనివర్సిటీ వారు ప్రభుత్వానికి 46 లక్షల పన్ను బకాయి పడ్డారని టీఎస్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోలి శివకుమార్, పార్లమెంట్ కార్యదర్శి కె.సుబ్రమణ్యం నాయుడు ఆరోపించారు. విద్యార్థుల నుంచి కోట్లాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ పన్ను కట్టకపోవడంలో ఆంతర్యమేమిటన్నారు. అదే సామాన్యులు కట్టకపోతే అధికారులు చూస్తూ ఊరుకుంటారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఈ బకాయిలను వసూలు చేయాలని డిమాండ్ చేశారు.

రేపు ప్రజాదర్బార్

లక్కిరెడిపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్డు రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లె రామప్రసాదురెడ్డి హాజరవుతున్నట్లు ఎంపీటీసీ మాజీ సభ్యుడు మదన్‌మోహన్‌తెలిపారు. మండలంలోని ప్రజలు, రైతులు మంత్రికి వినతిపత్రాలు అందజేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. కావున మండలంలోని ప్రజలు, రైతులు ప్రజాదర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆంజనేయాలయంలో మండల పూజలు


పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

రామాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావు పేటలో శ్రీరామధూత అభయహస్త ఆంజనేయస్వామి విగ్రహాలు ప్రతిష్ఠించి మండలం రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన గడికోట సుబ్బారెడ్డి, రామసుబ్బమ్మ, రామసుబ్బారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, గడికోట సహదేవరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని వితరణ చేసిన పారిశ్రామికవేత్త చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపోత్సవం, భజనలు నిర్వహిం చారు.

నిత్యపూజేశ్వరకోనలో పారిశుధ్య చర్యలు

సిద్దవటం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వంతాటిపల్లె గ్రామం లంకమల అడవుల్లో ని నిత్యపూజేశ్వరకోనలో శనివారం పారిశుధ్య పనులు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది చంద్ర మాట్లాడుతూ ఎండోమెంట్ ఈవో మోహన్‌రెడ్డి సూచన మేరకు కార్తీక మాసం సందర్భంగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, వన్యప్రాణులకు ముప్పు వాటిల్లకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారిగా సుబ్రమణ్యం



రాజంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండల వ్యవసా యాధికారిగా ఎస్‌వీ సుబ్రమణ్యం నియమితులయ్యారు. సుబ్రమణ్యం రైల్వే కోడూరు వ్యవసాయాధికారిగా పనిచేస్తూ రాజంపేటకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సహకరిస్తానన్నారు.

ఒంటిమిట్ట సీఐ బదిలీ

ఒంటిమిట్ట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల సర్కిల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణంరాజు నాయక్ శనివారం బదిలీ అయ్యారు. ఈయన ఆగస్టు 8న ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. వీఆర్‌లో ఉన్న బాబును ఒంటిమిట్టకు బదిలీ చేశారు. కాగా, నాలుగు నెలల్లోనే సీఐని బదిలీ చేయడం సర్కిల్ పరిధిలో చర్చనీయాంశంగా మారింది.

రాజంపేటలో ప్రభావం చూపని తుఫాన్

రాజంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలో తుఫాను చిరుజల్లులకు మాత్రమే పరిమితమైంది. దట్టమైన మేఘాలు అలముకుని ఈదురు గాలులు వీచినా అందుకుతగ్గట్లు వర్షం కురవలేదు. చిరుజల్లులు కురుస్తుండడం వల్ల గ్రామీణ రోడ్లు గుంతల్లో నీరు నిలిచింది.

వినూత్నంగా 'బడి వైపు ఒక అడుగు'


ఆహ్వాన పత్రికలు తయారు చేసిన విద్యార్థులతో ఉపాధ్యాయుడు రమణ

పుల్లంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బడి వైపు ఒక అడుగు.. తల్లి దండ్రులతో ముచ్చట్లు పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా డిసెంబరు 7న పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో దళవాయిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో రంగు రంగుల పేపర్లతో సొంతంగా అందమైన ఆహ్వాన పత్రికలు తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినూత్న సృజనాత్మక ఆలోచనలు విద్యార్థుల్లో జ్ఞానాభివృద్ధికి అవసరమని, పిల్లలకు ప్రోత్సాహం అందిస్తే ఏ పనినైనా సులువుగా నేర్చుకుంటారని ఉపాధ్యాయుడు రమణ వివరించారు.

- చామంతి రూ.100
- రైతులకు వచ్చేది తక్కువే...
- దళారులదే రాజ్యం..
- ప్రతి ఏటా ఏదో ఒక గడ్డు పరిస్థితి

ధరలున్నా దగాయేనా..!





వాల్మీకిపురం సమీపంలో సాగు చేసిన వైట్, పింక్ చామంతి పూలతోటలు

వాల్మీకిపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పూల సాగుతో కష్టాల నుంచి గట్టెక్కవచ్చని ఎంతో ఆశతో సాగు చేసిన రైతు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాడు. మార్కెట్‌లో పూల ధరలు బాగా ఉన్న దళారులే సంపాదిస్తున్నారు కానీ రైతుకు మాత్రం లాభాలు రావడం లేదని వాపోతున్నారు. వాల్మీకిపురం మండల వ్యాప్తంగా ప్రతి ఏటా వందెకరాలకు పైగా సాగు చేసే పూల తోటలు నేడు సగానికి తగ్గాయి. మండలంలో దాదాపు 50 ఎకరాలలో చామంతి పూల తోటలు సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో చామంతి పూలకు బాగా గిరాకీ ఉన్నా ధరలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన రైతు నరసింహులు ఎకరం పొలంలో రూ.లక్షకు పైగా పెట్టుబడితో చామంతి పూల తోటను సాగు చేశాడు. అలాగే వాల్మీకిపురానికి చెందిన శేషాద్రి తులసీరామ్ అనే రైతు అరెకరం పొలంలో రూ.60 వేలు పెట్టుబడితో పింక్, వైట్ చామంతి పూల తోటలు సాగు చేశాడు. మండలంలో సాగు చేసే చామంతి పూలకు బయటి మార్కెట్‌లకు ధరలు బాగానే ఉన్నా రైతుకు మాత్రం దాని ఫలితం దక్కడం లేదు. వాల్మీకిపురం నుంచి మదనపల్లె, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, బెంగళూరు తదితర ప్రాంతాలకు తరలిస్తుంటారు. వారం రోజుల క్రితం వరకు పండుగల నేపథ్యంలో చామంతి పూలకు మంచి గిరాకీ ఉండేది. ప్రస్తుతం బయటి ప్రాంతాల మార్కెట్లలో చామంతి పూలు కిలో రూ.100 వరకు పలుకుతున్నాయి. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న పూల ధరలు అధిక లాభాలు గడించలేకపోయినా అలా ఇలా పెట్టుబడులను రాబట్టుకోగలుగుతున్నామని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తే ఏనాడు కూడా రైతులు మంచి లాభాలను గడించిన దాఖలాలు లేవని రైతులు వాపోతున్నారు. రైతుల పంటలను మార్కెట్‌లకు చేరవేసే దశలో దళారుల రాజ్యం ఎక్కువవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లలో ఉండే ధరలలో కనీసం 70 శాతం రైతులకు చేరితే తమ శ్రమకు తగ్గ ఫలితం చూడగలుగుతామని చెబుతున్నారు.

పెట్టుబడులు రాబట్టుకుంటున్నాం..



రెండేళ్ల కాలంలో చామంతి పూల తోటల సాగులో పూర్తిగా నష్టాలనే చూశాం. ఈ ఏడాది కష్టకాలంలో శ్రమించి సాగు చేసిన చామంతి పూలకు కాసింత ఊరటనిచ్చే ధరలే ఉన్నాయి. పంటలకు అధిక లాభాలు రాకపోయినా రైతు పెట్టిన పెట్టుబడులు రాబట్టుకోవడం కాసింత సంతోషమే. రైతులు పండించే పంటలకు పూర్తి మద్దతు ధరలు పలకడం, ఆశించిన ఫలితాలు వస్తే అంతకన్నా సంతోషం ఇంకేముంటుంది. మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న ధరలు ఇలాగే అయినా కొనసాగితే బాగుపడతాం.

-నరసింహులు, రైతు, అయ్యవారిపల్లె

లాభాలు లేవు



నేటి గడ్డు పరిస్థితులలో రైతులు పండించే పంటలకు ఆశించే స్థాయిలో లాభాలను చూడలేకపోతున్నాం. ఈ ఏడాది తొలిసారి అరెకరంలో చామంతి రకాల పూల తోటలు సాగు చేశా. కూలీలు భారం అయినప్పటికీ పెట్టిన పెట్టుబడులు అయినా వస్తాయన్న ఆశతో ఉన్నాం. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు ఉన్నప్పుడే వ్యవసాయంలో ముందుకెళ్లగలం. ప్రభుత్వం కూడా దళారుల పాత్రపై దృష్టి పెట్టాలి.

-శేషాద్రి తులసీరామ్, రైతు, వాల్మీకిపురం.

కష్టకాలంలో సాగు చేసిన పంట చేతికొచ్చే సమయాన కోత కూలీలు భారంగా మారుతున్నాయి. వీటిని అధిగమించాలంటే రైతు సాగు చేసే పంటలకు మంచి ధరలు పలకాలి.

పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి మున్సిపాలిటీ పరిధిలోని రాయుడుకాలనీలో లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు డబ్బు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ లక్ష్యసాధన దిశగా ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అర్హులకు అందజేసి వారికి సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని కల్పించడం జరిగిందన్నారు. కుల, మత పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అర్హులకు అందజేయడం జరుగుతోందన్నారు. గతంలో పింఛన్‌దారులు 1వ తేదీ పింఛన్ తీసుకోకపోతే ఆ పింఛన్ క్యాన్సిల్ చేసేవారని, నేడు ప్రభుత్వం రెండు, మూడు నెలలైనా లబ్ధిదారులకు పింఛన్ మొత్తం కలిపి ఇవ్వడం జరుగుతోందన్నారు. అలాగే అభివృద్ధిలో వెనుకబడి ఉన్న రాయచోటి ప్రాంతాన్ని నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రామాలయంలో పూజలు చేసి పించన్ల పంపిణీలో పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక



గాలివీడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎగువ గొట్టివీడు జిల్లా పరిషత్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి పి.బాలగంగాధర్ నాయుడు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-14 విభాగంలో పూతలపట్టులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. .


నీలకంఠ్రావుపేట విద్యార్థి...



రామాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి నాగచైతన్య జాతీయ త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. చిత్తూరు జిల్లా పూతలపట్టులో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి త్రోబాల్ అండర్-14 బాలుర విభాగంలో మంచి ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ తెలిపారు.

ఆ చర్చిది 137 ఏళ్ల ఘన చరిత్ర







137 సంవత్సరాల పురాతన పరిపేతురు, పరిపౌలు చర్చి - ఇటుకలతో నిర్మించిన చర్చి ముందుభాగం - చర్చి లోపల భాగం

- 2, 3 తేదీల్లో పరిపేతురు, పరిపౌలు చర్చి వార్షికోత్సవం

కలసపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కలసపాడు సగిలేరు నది ఒడ్డున 19వ శతాబ్దంలో ఆంగ్లేయులు నిర్మించిన పురాతన చర్చికి వచ్చిన కోరికలు కోరుకుంటే అవి తీరుతాయని భక్తుల నమ్మకం. 137 సంవత్సరాల చరిత్ర కలిగిన చర్చి వార్షికోత్సవం డిసెంబరు 2, 3వ తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నారు. వేలాదిమంది క్రైస్తవులు హాజరయ్యే తిరుణాలకు చర్చి కమిటీ ఏర్పాట్లు చేస్తుండగా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు.

19వ శతాబ్దంలో చర్చి నిర్మాణం..

19వ శతాబ్దంలో ఇంగ్లాండు నుంచి ఎస్పీజీ మిషనరీలు కలసపాడుకు వచ్చారు. పేద పిల్లల కోసం ఎస్‌పీజీ పాఠశాల ఏర్పాటు చేసి 1884వ సంవత్సరం రెవరెండ్ క్యానమ్ ఆర్థర్ ఇన్‌మన్ చర్చి నిర్మాణానికి పునాది వేశారు. 1887 నాటికి పూర్తి చేసి అప్పటి చెన్నపట్నం నాలుగో బిషప్ రైట్ రెవరెండ్ హెడ్రిక్‌చే ప్రతిష్ఠ నిర్వహించారు. చర్చికి పరిపేతురు, పరిపౌలు ఆలయంగా నామకరణం చేశారు. అప్పటి నుంచి ప్రతి యేటా డిసెంబరు 2, 3 తేదీల్లో ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

అద్భుత నిర్మాణం..

కలసపాడు చర్చి నిర్మాణం అద్భుతంగా జరిగింది. స్థానికంగా దొరికే బంకమట్టితో ఇటుకలు తయారు చేసి వాటిని సగిలేరు నదిలో నానబెట్టారు. గట్టిగా ఉన్న ఇటుకలతో పాటు బెల్లం, కోడిగుడ్లు, సున్నం గచ్చులతో యు ఆకారంలో శిలువ గుర్తు వచ్చే విధంగా చర్చి నిర్మాణం చేపట్టారు. చర్చికి ఇరువైపులా వరండాపై చెక్కుచెదరని టేకు దూలాలు ఏర్పాటు చేసి మట్టితో తయారు చేసిన పెంకులను పైకప్పుగా వినియోగించారు. 137 సంవత్సరాలైనా ఏమాత్రం చెక్కుచెదరక భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

భారీగా ఏర్పాట్లు...

చర్చి తిరుణాలకు దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది హాజరుకానున్నారు. అంతేకాక ఈ తిరుణాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తల నీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. మైదుకూరు, బద్వేలు, గిద్దలూరు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేయనుంది.

కార్యక్రమాలు..

2వ తేదీ సాయంత్రం విదేశాల నుంచి వచ్చే అతిథులతో పాటు నంద్యాల డయాసిస్ బిషప్ ప్రముఖులకు స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ఊరేగింపు నిర్వహించనున్నారు. 8.30 గంటలకు దీపారాధన, 9.30కు కానుకలు సమర్పించడం, 11.30 గంటలకు ధనవంతుడు-బీదలాజరు నాటకంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

3వ తేదీ ఉదయం 4 గంటలకు ఆరాధన, 7 గంటలకు గుడి ప్రదర్శన, 9 గంటలకు బాప్తిష్మములు, సాయంత్రం 4 గంటలకు ప్రతిష్ఠ ప్రత్యేక పండుగ కార్యక్రమం నిర్వహించనున్నారు.

యువజనోత్సవం విజేతలు వీరే

బహుమతులు ప్రదానం చేసిన స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శంకర్



బహుమతులు అందజేస్తున్న రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శంకర్

రామాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పేరును జాతీయ స్థాయిలో నిలబెట్టాలని రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ సూచించారు. బిట్స్ కాలేజీలో శనివారం జరిగిన జిల్లా స్థాయి యువజనోత్సవాల విజేతలను ఆయన అభినందించారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవ్‌లో పెయింటింగ్ విభాగంలో మొదటి బహుమతి వెన్నెల, రెండవ బహుమతి కేవీ స్రవంతి, మూడవ బహుమతి కె.రెడ్డిఇషాంత్, కవిత్వం విభాగంలో మొదటి బహుమతి పి.సమీరాఖానం, రెండవ బహుమతి కె.కార్తీక, మూడవ బహుమతి వి.నిఖిత సాధించారు. అలాగే మొబైల్ ఫొటోగ్రఫీ విభాగంలో మొదటి బహుమతి సి.సాయికిరణ్‌రెడ్డి, రెండవ బహుమతి పి.గౌతమి, మూడవ బహుమతి ఎస్.రితికారెడ్డి, సైన్స్ ఎగ్జిబిషన్ గ్రూప్ విభాగంలో మొదటి బహుమతి రూప టీం, రెండవ బహుమతి లక్ష్మీనాథ్‌శర్మ టీం, మూడవ బహుమతి సి.తరుణ్‌కుమార్ గౌడ్ టీం సాధించింది. వ్యక్తిగత విభాగంలో మొదటి బహుమతి కేవీఎంఎస్ యశ్వంత్, రెండవ బహుమతి సిద్దేశ్వర్, మూడవ బహుమతి గురుచరణ్ రెడ్డి, కల్చరల్ ఫెస్టివల్‌లో మొదటి బహుమతి మదనపల్లెకు చెందిన జ్ఞానాంబిక కాలేజీ లంబాడీ టీం, రెండవ బహుమతి జ్ఞానాంబిక కాలేజీకి చెందిన కోయ టీం, మూడవ బహుమతి రాయచోటి మోడల్ కాలేజీకి చెందిన వైశాలీ టీం గెలుపొందింది. విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపిక, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్ అందజేశారు. ముగింపు కార్యక్రమంలో యువ అధికారి మణికంఠ, స్టెప్ సీఈవో సాయిగ్రేస్, భాస్కర్ కాలేజ్ కరస్పాండెంట్ భాస్కర్, ప్రిన్సిపాల్ ఏసీఎస్ రెడ్డి, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ మురళీనాయక్, పెద్దఎత్తున యువత స్టెప్ సిబ్బంది, నెహ్రూ యువకేంద్ర వలంటీర్లు పాల్గొన్నారు.

బైకుల దొంగ అరెస్టు

ఎనిమిది బైకులు స్వాధీనం



బైకుల దొంగను అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ పోలీసులు

మదనపల్లె అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణ పరిసర ప్రాంతాల్లో బైకుల దొంగతనానికి పాల్పడిన దొంగను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరిసావల్లి తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల వివరాలు వెల్లడించారు. మదనపల్లె పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన సయ్యద్ అబ్దుల్ (48) స్థానిక ఉర్దూ స్కూల్ ఎదుట చెప్పుల దుకాణం నిర్వహిస్తున్నాడు.

దీంతో పాటు అతడు బైకుల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో వెంటనే అతడిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 2.50 లక్షల విలువ చేసే 8 బైకులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడికి వైద్య పరీక్షలు నిర్వహించి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఇందులో వన్‌టౌన్ ఎస్ఐ అన్సర్‌బాషా, పోలీసులు పాల్గొన్నారు.

గండికోటలో గొడవ .. కారు అద్దాలు ధ్వంసం

జమ్మలమడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోటలో గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు ధ్వంసం చేశారని బాధితుడు హైదరాబాద్ వాసి శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు అందించిన వివరాల్లోకెళితే... గండికోట చూసేందుకు హైదరాబాదు నుంచి కారులో నలుగురు వచ్చారు. వారు శనివారం ఉదయం గండికోటలోని జుమ్మా మసీదు, ధాన్యాగారం, లోయ, మాధవరాయస్వామి దేవాలయం చూశారు. లోయకు సమీపంలో అనుమతి లేకుండా వేసిన లేని టెంట్ల వద్ద కొందరు మాటా మాట పెరిగి గొడవకు దిగారు. అయితే గొడవపడిన వారు సమీపంలో ఉన్న నల్లకారును చూసి కారు అద్దాలు ధ్వంసం చేశారని బాధితులు వివరించారు. కాగా గొడవతో అసలు సంబంధంలేని హైదరాబాదీల కారు అద్దాలు ధ్వంసం చేయడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గండికోటలో అనధికారిక టెంట్లు వేయడం తగదని వారు ఆరోపించారు. ఇతరులకు గొడవ జరిగితే గొడవకు సంబంధంలేని తమ కారు అద్దాలు ధ్వంసం చేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గొడవ విషయమై జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆంధ్రజ్యోతికి వివరణ ఇస్తూ అనధికారికంగా వేసిన టెంట్లపై, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే కారు అద్దాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

ఏపీఆర్‌జేసీ రాష్ట్ర స్థాయి పోటీల్లో

జిల్లా క్రీడాకారుల ప్రతిభ

పెదవేగి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల (ఏపీఆర్‌జేసీ) రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. రాష్ట్రంలోని నాలుగు జోన్ల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ పరిధిలో విశేష ప్రతిభతో పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయస్థానం సాధించిన విజేతలు తదుపరి జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రస్థాయి జట్లకు ఎంపికవుతారని పెదవేగి గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. కబడ్డీలో లక్కిరెడ్డిపల్లి బాలికల జట్టు, జోన్-4, ప్రథమ, భీమిలి జట్టు జోన్-1 ద్వితీయస్థానం సాధించారు. అలాగే బాలికల కబడ్డీ సీనియర్స్ విభాగంలో లక్కిరెడ్డిపల్లి జట్టు జోన్-4 ప్రథమ, సంఘం జట్టు జోన్-3 ద్వితీయస్థానం సాధించారు.

విజయవంతంగా ముగిసిన స్పోర్ట్స్ మీట్

- టగ్ ఆఫ్ వార్ విజేత ఎస్పీ జట్టు
- విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ అందజేసిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



పోలీస్ స్పోర్ట్స్ మీట్స్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో మూడు రోజులుగా నిర్వహించిన పోలీస్ వార్షిక గేమ్స్, స్పోర్ట్స్ మీట్ శుక్రవారం రాత్రి ముగిశాయి. ఈ వేడుకలకు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మూడు రోజులుగా నిర్వహించిన క్రీడా పోటీల్లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లను ఎస్పీ ఆసక్తిగా తిలకించారు. టగ్ ఆఫ్ వార్‌లో ఎస్పీ జట్టు విజయం సాధించింది. టగ్ ఆఫ్ వార్‌లో ఎస్పీ కూడా పాల్గొని క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం మూడు పోలీసు సబ్ డివిజన్లు, రాయచోటి, మదనపల్లె, రాజంపేట, ఆర్మ్‌డ్ రిజర్వు నుంచి పాల్గొన్న పోలీసు క్రీడాకారులు ముగింపు మార్చ్ ఫాస్ట్ చేసి ఎస్పీకి గౌరవ వందనం చేశారు. పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో వ్యక్తిగత ఛాంపియన్‌గా ఏఆర్‌పీసీ శ్రీనునాయక్ నిలిచారు. ఓవరాల్ ఛాంపియన్‌గా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు జట్టు నిలిచింది. స్పోర్ట్స్ మీట్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు, విజేతలకు ఎస్పీ ట్రోఫీలు, మెడల్, మెమెంటోలు, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసు స్పోర్ట్స్ గేమ్స్ మీట్ పండుగ వాతావరణంలో ఉత్సాహంగా జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిరోజు చురుకుగా విధులు నిర్వర్తించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సాధారణమని, క్రీడా స్ఫూర్తితో ఓటమిని కూడా ఆనందంగా స్వీకరించినప్పుడే జీవితంలో కూడా ఒడిదుడుకులను ఎదుర్కోగలమన్నారు. స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన పోలీసు అధికారులకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లకు, పోలీసు సిబ్బందికి ఎస్పీ మెమెంటోలను అందజేసి అభినందించారు. క్రీడల ముగింపు వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, మదనపల్లి డీఎస్పీ డి.కొండయ్యానాయుడు, రాజంపేట డీఎస్పీ ఎన్.సుధాకర్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, ఫిజికల్ డైరెక్టర్లు, వైద్య బృందం పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో సీఐల బదిలీ

కడప(క్రైం), నవంబరు(ఆంధ్రజ్యోతి)30: ఉమ్మడి కడప జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు తక్షణమే కేటాయించిన స్టేషన్‌లలో రిపోర్టు చేశాయలంటూ ఆదేశాలు జారీ చేశారు.

సీఐ పేరు	పనిచేస్తున్న స్టేషన్	బదిలీ అయిన స్టేషన్
ఎ. చాన్‌బాష	వీఆర్ అన్నమయ్య	డీటీసీ నంద్యాల
జి.ఓబులేష్	ఆత్మకూరు నంద్యాల	కడప చిన్నచౌకు
క్రిష్ణంరాజు నాయక్	ఒంటిమిట్ట	వీఆర్ కడప
నాగరాజు	ఆర్‌కే వ్యాలీ	సోషియల్ మీడియా, సైబర్ సెల్ కడప
టి.బాబు	వీఆర్ కడప	ఒంటిమిట్ట
ఉలసయ్య	వీఆర్ చిత్తూరు	ఆర్‌కే వ్యాలీ
వెంకట కుమార్	ఎస్‌బీ-1 కడప	వీఆర్ కడప
టి.రెడ్డప్ప	వీఆర్ కడప	ఎస్‌బీ-1కడప
సురేంద్రనాథ్ రెడ్డి	వీఆర్ అన్నమయ్య	ఎస్‌బీ-2 కడప
ఈదురు బాష	వీఆర్ కడప	ఏహెచ్‌టీయూ కడప
నరసింహులు	ఆర్‌ఎస్ఎఎస్‌టీఎఫ్, కడప	పులివెందుల
రాజారెడ్డి	బి.కొత్తకోట అన్నమయ్య	ఎస్‌బీ-3 అన్నమయ్య
జీవన్ గంగనాద్‌బాబు	పులివెందుల	బి.కొత్తకోట అన్నమయ్య
టి.మధు	వీఆర్ అన్నమయ్య	ఆర్‌ఎస్ఎఎస్‌టీఎఫ్, అన్నమయ్య
టి.వి.సత్యనారాయణ	ఎస్‌బీ-1అన్నమయ్య	వీఆర్ అన్నమయ్య
రాజా రమేష్	ఎస్‌బీ-3అన్నమయ్య	ఎస్‌బీ-1అన్నమయ్య
జె.శంకరయ్య	డీసీఆర్‌బీ అన్నమయ్య	వీఆర్ అన్నమయ్య
తులసీరామ్	వీఆర్ అనంతపురం	డీసీఆర్‌బీ అన్నమయ్య

నిర్మల ఫార్మశీకి న్యాక్ అనుబంధ గుర్తింపు



ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న కళాశాల చైర్మన్ శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కడపనగరం నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మశీకి ప్రతిష్టాత్మక న్యాక్ అనుబంధ గుర్తింపు వచ్చింది. 2024 విద్యాసంవత్సరం నుంచి 2029 విద్యాసంవత్సరం వరకు ఈ గుర్తింపు వర్తిస్తుందన్నారు. గత జూన్‌లో న్యాక్ సంస్థ ముగ్గురు నిపుణుల బృందాన్ని పంపించి ఐదేళ్లలో విద్యావిధానం, అడ్మిషన్లు, ఫార్మశీరంగంలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన క్యాంపస్ సెలక్షన్లు సైంటిఫిక్ సెమినార్లు వర్క్‌షాపులు స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, మానసిక శారీరక ధృఢత్వానికి అవసరమైన యోగా వివిధ ఆటల పోటీల నిర్వహణ, ఇతర కళాశాలల ఫార్మశీ కంపెనీలతో కలిసి పనిచేసే అవసరమైన అనుబంధ పత్రాలు వీటిపై క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి చెంది న్యాక్ అనుబంధ గుర్తింపు క్రించింది. ఈ విషయంలో కళాశాల యాజమాన్యం బోధన బోధనేతర సిబ్బంది కృషి గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ ఒక ప్రశంసాపత్రాన్ని పంపిందని కళాశాల చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. అనుబంధ గుర్తింపు తీసుకురావడానికి కృషి చేసిన డాక్టర్ మోహనకుమార్, న్యాక్‌కోఆర్డినేటరు స్రవంతి, ఉపాధ్యాయులను అభినందించారు.

విదేశీ విద్యపై అవగాహనసదస్సు


విదేశీ విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భూపేంద్ర

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో చదవాలనుకునే విద్యార్థులకు శనివారం ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ కార్యాలయంలో హైదరాబాదుకు చెందిన అబాకర్స్ ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ అడ్వైజర్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా వ్యాప్తంగా 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. నిర్వాహకులు విదేశాల్లో చదువు, కెరీర్, భవిష్యత్తు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విదేశాల్లో ఏయే యూనివర్శిటీల్లో ఏయే కోర్సులు అందుబాటులో ఉన్నాయి, మంచి యూనివర్శిటీలు, రాయాల్సిన పరీక్షలు, వీసా, రుణ సౌకర్యం, సమర్పించాల్సిన డాక్యుమెంట్లపై విద్యార్థులకు వివరించారు. అబాకర్స్ ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ అడ్వైజర్స్ డైరెక్టర్ భూపేంద్ర మాట్లాడుతూ అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ప్రముఖ యూనివర్శిటీల్లో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మేనేజ్‌మెంట్, బయోటెక్నాలజీ వంటి కోర్సుల్లో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆయా యూనివర్శిటీల్లో చదవడంతో మంచి అవకాశాలు లభిస్తాయని, అలాగే పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసి యూనివర్శిటీ ఫీజులను సొంతంగా చెల్లించుకోవచ్చన్నారు. పోస్ట్ స్టడీ వర్క్ వీసా ద్వారా రెండు మూడేళ్లు ఆ దేశాల్లోనే పనిచేసుకోవచ్చని సూచించారు.

ప్రవచన కర్త పుష్పగిరి క్షేత్ర సందర్శన


ప్రవచనకర్త శ్రీనివాసులును సత్కరిస్తున్న దేవస్థానం సభ్యులు

వల్లూరు/ఖాజీపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రవచన కర్త నండూరి శ్రీనివాస్ శనివారం పుష్పగిరి క్షేత్రంలోని చెన్నకేశవస్వామి వారిని దర్శించుకున్నారు. కార్తీకమాసం ముగుస్తుండడంతో ఆలయంలో మహిళలు కార్తీక దీపాన్ని వెలిగించి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రవచనకర్త శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారి ద్వారా స్వామివారి చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి తదితరులున్నారు.

వర్షం కారణంగా ఆగిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్ నవంబరు30, (ఆంధ్రజ్యోతి): ఏసీఏ మెన్ అండ ర్- 23 ఇంటర్ జోనల్ వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లు శనివారం వ ర్షం కారణంగా ఆట మధ్యలోనే నిలిచిపోయాయి. వివరాలిలా...

వైఎస్ రాజారెడ్డి - ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈస్ట్ గోదావరి- రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సౌ త్‌జోన్ బ్యాటింగ్‌కు దిగి 33 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 234 పరుగుల స్కోర్ సాధించింది. కాగా వర్షం రాకతో ఆట నిలిచిపోయింది. కేఎస్‌ఆర్ఎం మైదానంలో ప్రకాశం- అనంతపురం జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు 41.3 ఓవర్లలో 239 పరుగుల స్కోర్ సాధించి ఆలౌట్ అయింది. తర్వాత వర్షం కారణంగా ఆట నిలిచిపోయే సమయానికి ప్రకా శం జట్టు 14 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 101 పరుగులు చేసింది. కేఓఆర్ఎం మైదానంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్- రెస్ట్ ఆఫ్ నార్త్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్‌నెగ్గిన రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ జట్టు బ్యాటింగ్‌కు దిగి 45 ఓవర్లలో 8 వికెట్లు కోల్పో యి 186 పరుగులు చేసింది. ఇందులో వి. వర్ధన్ 44 పరుగులు, రాజు 42 పరుగులు చేశారు. అనంతరం వర్షం రాకతో రెస్ట్ ఆఫ్ నార్త్ జట్టు మ్యాచ్ సాగలేదు.

మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామిపై కేసు నమోదు

బద్వేలుటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామిపై పలుసెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె పంచాయితీ 1754/2 సర్వేనెంబర్‌లో జరిగిన భూ అవకతవకలపై లబ్ధిదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

భర్త మృతి చెందిన మూడు రోజులకే...

ప్రమాద వశాత్తు భార్య నాగసుధ మృతి

లింగాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భర్త నాగరాజు మృతి చెందిన మూడు రోజులకే భార్య నాగసుధ(36) మృతి చెందింది. లింగాల ఎస్‌ఐ మధు సూదన్‌రావ్ అందించిన వివరాల్లోకెళితే... పార్నపల్లె వాసి సాకే నాగరాజు నవంబరు 26న మృతి చెందాడు. అయితే మృతుడి భార్య నాగసుధ భర్త సమాధి వద్దకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపుతప్పి ప్రమాద వశాత్తూ కింద పడింది. దీంతో నాగసుధకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

వెంటాడిన మృత్యువు

బైక్, ట్యాంకర్ ఢీ - లెక్చరర్ దుర్మరణం


మల్లికార్జున రాజు మృతదేహం - (ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో)

ఎర్రగుంట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మరో 15నిమిషాల్లో గమ్యాన్ని చేరబోతుండగా మృత్యువు సిమెంట్ ట్యాంకర్ రూపంలో వెంటాడి తన ఒడికి చేర్చుకుందని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. లెక్చరర్ డాక్టర్ బి.మల్లికార్జునరాజు వెళుతున్న బైక్‌ను ట్యాంకర్ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వివరాల్లోకెళ్లితే....

ప్రొద్దుటూరు మండలం శంకరాపురం వాసి డాక్టర్ బి.మల్లికార్జునరాజు ఎర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడేళ్లుగా తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఈయన ప్రొద్దుటూరులో కాపురం ఉంటూ ఎర్రగుంట్లలోని కళాశాలకు వచ్చి విధులు నిర్వహించి వెళ్లేవారు. శనివారం ఉదయం కాలేజికి మోటార్‌బైక్‌లో బయలుదేరాడు. మరో 10నిమిషాల్లో గమ్యాన్ని చేరుకునే సమయంలో ప్రొద్దుటూరు పెన్నా వంతెన దిగగానే పోట్లదుర్తి నడిగడ్డ శివాలయం మలుపు వద్ద అదేవైపు నుంచి వస్తున్న ట్యాంకర్ ఢీకొంది. దీంతో మల్లికార్జునరాజు ట్యాంకర్ కిందపడడంతో ఆయన మెడపై టైర్లు ఎక్కడంతో టైర్ల మధ్యలో ఇరుక్కుపోయాడు. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎర్రగుంట్ల సీఐ నరేష్ బాబు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీశారు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

దిగ్భ్రాంతికి లోనైన సిబ్బంది

ఎర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ మల్లికార్జునరాజు సంఘటలన తీవ్రదిగ్భ్రాంతికి లోనుచేసిందని ప్రిన్సిపాల్ రవికుమార్ అన్నారు. సిబ్బందితో కలిసి సంఘటనా స్థలిలో మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు. తెలుగు లెక్చరర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా హుషారుగా ఉండేవారన్నారు. అందరిని ఆకట్టుకునే వారని, ఆయన మృతి తమకు తీవ్ర దుఃఖాన్ని మిగిల్చిందన్నారు. మల్లికార్జున అంత్యక్రియలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

బడి వైపు ఒక అడుగు : కలెక్టర్

కడప కలెక్టరేట్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): పిల్లల బంగారు భవిష్యత్తు కోసం... తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బడి వైపు ఒక అడుగు వేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ సభా భవనంలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌పై ఎంఈఓలు, ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యం ఉన్నపుడే ఏ రంగమైనా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర విద్యాభివృద్ధిలోనూ కీలక భాగస్వామి కావాలన్నదే ప్రధాన లక్ష్యమన్నారు. పేదరికంలేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా విద్యా రంగంలో అనేక సంస్కరణలు పరిశీలించిన ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల మధ్య సంబంధాలు బలపరిస్తే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెంది 2047కు వికసిత ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దాలని సంకల్పించారన్నారు. ఇందులో భాగంగానే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (మెగాపీటీఎం)ని దేశంలోనే ఆదర్శవంతంగా నిర్వహించాలన్నారు. 2009లో భారత ప్రభుత్వం మన పిల్లల కోసం బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం తీసుకు వచ్చారన్నారు. పాఠశాలల పనితీరు మెరుగుపరిచే క్రమంలో స్థానిక ప్రజల భాగస్వామ్యం కల్పించి పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఖచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, సిబ్బందితో సమావేశమై రూపొందించిన నమూనా ఆధారంగా పాఠశాలల్లో మెగా పీటీఎం నిర్వహించడానికి ప్రణాళికను రూపొందించు కోవాలన్నారు. తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, సమాజ సేవకులు దాతలను ఆహ్వానించేందుకు స్వయంగా విద్యార్థుల చేత ఆహ్వాన పత్రికలు సిద్ధం చేయించాలన్నారు. అవసరమైన కార్డులు, పెయింట్స్, కలర్ పెన్సిల్, స్కెచ్ పెన్స్‌ను స్కూల్ హెడ్ సమకూర్చాలన్నారు. జేసీ అదితి సింగ్, జడ్పీసీఈఓ ఓబులమ్మ, మున్సిపల్ కమిషనరు మనోజ్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఇసుక పంపిణీ సజావుగా జరగాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇసుక పంపిణీ పక్రియ సజావుగా జరగాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇసుక బుకింగ్, సరఫరా, లభ్యత అంశాలపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి డీఎల్ఎస్‌సీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ప్రతి స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు నిరంతరం పని చేసేలా చూసుకోవాలన్నారు. ఆర్డీఓలు తమ పరిధి స్టాక్ పాయింట్ రీచ్‌లను తనిఖీ చేసి సమస్యలుంటే పరిష్కరించాలన్నారు. ఇసుక పంపిణీ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యావరణ అనుమతులు పొందిన సిద్దవటం మండలం గుండ్లమూల, చక్రాయపేటలోని గండికోవూరు, వీఎన్ పల్లి మండలం తంగేడు పల్లి మూడు సెమీ మెకనైజెడ్ ఇసుకరీచులకు నోటిఫికేషన్ ఇచ్చి టెండర్లు పిలిచారన్నారు. వీటికి 13 టెండర్లు అప్లికేషన్లు వచ్చాయన్నారు. ఇందులో 11 అర్హత పొందాయని తెలిపారు. తంగేడు పల్లి ఇసుక రీచ్‌ను అంకిరెడ్డి అండ్ సన్స్ రూ.24.50 బిడ్‌ధరకు దక్కించుకున్నారు. మిగతా రెండు రీచ్‌లకు తక్కువ ధరకు కోడ్ చేసిన వాటికి నోటీసులు ఇచ్చి డీఎల్ఎస్‌సీ కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

నేటి ర్యాలీని విజయవంతం చేయాలి : డీఎంహెచ్ఓనాగరాజు

కడప కలెక్టరేట్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, అదనపు డీఎం అండ్‌హెచ్ఓ, డీఎల్‌టీఓ డాక్టర్ సగిలి రవిబాబు పిలుపు నిచ్చారు. శనివారం డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడు తూ డిసెంబరు1 ప్రపంచ ఎయిడ్స్ నివా రణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. 'హక్కుల మార్గాన్ని అనుసరించండి - నా ఆరోగ్యం నా హక్కు' నినాదంతో హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు అండగా ఉండా లన్నారు. కార్పొరేషన్ నుంచి డీఎంఅండ్ హెచ్ఓ కార్యాలయం వరకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ చేస్తున్న ర్యాలీని విజ యవంతం చేయాలన్నారు. డిసెం బరు 1 నుంచి 15వ తేదీ వరకు పాఠశా లలు, కళాశాలలు, మహిళా స్వయం సహాయక సంఘాల్లో హెచ్ ఐవీ,ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, ప్రోగ్రామ్ ఆఫీసరు, సిబ్బంది హజరయ్యారు.

జీఎస్టీని హెడ్ ఆఫ్ అకౌంట్స్‌కు జమచేయాలి

● జీఎస్టీ జాయింట్ కమిషనర్ కల్పన


మాట్లాడుతున్న జీఎస్టీ జాయింట్ కమిషనర్ కల్పన

కడప రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో చేపట్టిన, చేపడుతున్న పనుల నుంచి తగ్గించిన జీఎస్టీ, క్యుసీ, ఎన్ఏసీ, లేబర్ సెస్ మొత్తాన్ని వెంటనే సంబంధిత శాఖల హెడ్‌ఆఫ్‌అకౌంట్స్‌కు జమచేయాలని జీఎస్టీ జాయింట్ కమిషనర్ జి. కల్పన, అసిస్టెంట్ కమిషనర్ ఎస్. రాజా నరసింహారెడ్డి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ పేర్కొన్నారు. శనివారం జడ్పీ సమావేశ హాలులో ఉమ్మడి కడప జిల్లాలోని 50 మండలాల ఎంపీడీఓలు, పరిపాలనా అధికారులకు జీఎస్టీ చెల్లింపు విధానం, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించిన వారు మాట్లాడుతూ జీఎస్టీ చెల్లింపుపై పూర్తిస్థాయి చర్యలను చేపట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పురోగతిని సాధించాలన్నారు. డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ ఉపాధి ద్వారా జరుగుతున్న క్యాటల్ సీడ్స్, సీసీ రోడ్ల పనులకు తగిన ప్రాధాన్యతను కల్పించాలన్నారు. పనిదినాలను మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

'ఎయిడ్స్ నిర్మూలనకు నడుం బిగిద్దాం'



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నిర్మూలనలో మనమంతా నడుం బిగిద్దామంటూ వైవీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ శరీరంలోని రోగనిరోధకశక్తిని తగ్గిస్తుందని దీని వల్ల శరీరం ఇతర వ్యాధులకు గురవుతుందన్నారు. రక్తమార్పిడి, కలుషిత సిరంజి, అనైతిక శృంగారంతో ఎయడ్స్‌వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటరామిరెడ్డి ప్రొఫెసరు క్రిష్ణారావు,డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు వెంకటరమణ, సుమిత్ర, డాక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

సింహాద్రిపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాల కామర్స్ లెక్చరర్ పి. ఖైరున్నీసా మెడలో బంగారు గొలుసు దుండగులు లాక్కెళ్లినట్లు పోలీసులు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి సమాచారం మేరకు ఖైరున్నీసా ముద్దనూరు నుంచి రోజూ కళాశాలకు వచ్చి సాయంత్రం ప్రొద్దుటూరు బస్సుకు వెళ్తుండేది. ఈ నేపథ్యంలో శనివారం విధులు పూర్తి చేసుకుని బస్సు కోసం విద్యుత్ సబ్-స్టేషన్ వద్ద మెయిన్ రోడ్డుపై వేచి వుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైకుపై వచ్చి ఆమె మెడలోని 20 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రమాదవశాత్తు టీడీపీ కార్యకర్త మృతి



వీరపునాయునిపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనిమెల టీడీపీ క్రియాశీలక కార్యకర్త బత్తల బ్రహ్మయ్య (37) ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఎస్ఐ మంజునాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం బ్రహ్మయ్య పిల్లవాడి పాఠశాలకు వెళ్లాడు. అక్కడ పిల్లవాడి చెప్పులకోసం పాఠశాల మెట్లు ఎక్కుతుండగా జారి వెనక్కి పడ్డాడు. బలమైన గాయమవడంతో చికిత్స కోసం వేంపల్లెకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ఖాజీపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కూనవారిపల్లె పంచాయతీ సీతానగరం వద్ద విద్యుత్తు అర్త్‌వైరు తగిలి గేదె మృతిచెందింది. వివరాల్లోకి వెళ్లితే... కూనవారిపల్లె వాసి గోసుల యల్లారెడ్డి దినచర్యలో భాగంగా పశువులను మేపుకునేందుకు వెళుతుండగా రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన సింగిల్‌పేజ్ ట్రాన్స్‌ఫార్మర్ అర్త్‌వైర్‌కు విద్యుత్తు సరఫరా జరిగింది. ఈ తీగె గేదెకు తగిలి మృతి చెందుతుండగా ఏమైందని యజమాని పరిశీలించేందుకు తగలగా విద్యుత్తు షార్ట్‌సర్క్యూ ట్ జరిగి యజమాని కూడా కిందపడ్డాడు. విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యానికి గేదెను కోల్పోవాల్సి వచ్చిందని యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

కదలని చెరువు కట్ట విస్తరణ



ఆగిన గుడిసెవారిపల్లి చెరువు కట్ట విస్తరణ అభివృద్ధి పనులు

పెద్దమండ్యం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం మండలం పాపేపల్లి గ్రామ పంచాయతీ గుడిసెవారిపల్లి చెరువు కట్ట విస్తరణ పనులు ముందుకు సాగడంలేదు. జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు నెల రోజుల క్రితం ప్రారంభమైన పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో మళ్లీ ఎప్పుడు మొదలవుతాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వివరాల్లో వెలితే ఈ ఏడాది సెప్టెంబరు 9వ తేదీన వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా గుడిసెవారిపల్లి చెరువు కట్టపై ట్రాక్టర్ అదుపు తప్పి చెరువులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పి. తురకపల్లి కు చెందిన ఎస్. మౌలా కొడుకు అఫ్జల్ (11) మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ సంఘటన తెలుసుకున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సెప్టెంబరు 10వ తేదీన గుడిసెవారిపల్లి చెరువుకట్ట వద్ద జరిగిన ప్రమాద స్థలాన్ని పరిశీలించి చెరువు కట్ట దారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా కట్ట విస్తరణ అభివృద్ధి పనులకు ఇరిగేషన్, ఉపాధి పథకం ద్వారా సుమారు రూ. 40 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో గత ఒకన్నర నెల క్రితం రూ.. 40 లక్షల నిధులతో గుడిసెవారిపల్లి చెరువు కట్ట విస్తరణ అభివృద్ధి పనులను అధికారులు, కూటమి నేతలు శ్రీకారం చుట్టారు. చెరువు కట్టప్రాంతంలో కంప చెట్లు తొలగించి కొంత మేర మట్టి పనులు ప్రారంభించారు. అయితే ఆ తర్వాత చెరువు కట్ట విస్తరణ పనులు ఆగి పోయాయి. నిలిచిపోయిన పనులను వెంటనే చేపట్టాలని గుడి సెవారిపల్లి, పి. తురకపల్లి గ్రామస్థులు కోరుతు న్నారు. వర్షాల కారణంగా చెరువు నిండితే చెరువు కట్ట అభివృద్ధి పనులు ఆగిపోతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మరో పక్క చెరువు కట్టకు వేసిన కట్టరాళ్ల తొలింపుతో కట్ట బలహీన పడిందని భారీ వర్షం కురిస్తే కట్ట తెగే ప్రమాదం ఉందని గ్రామస్థులు వాపోతున్నారు.

నీటి సంఘాల ఎన్నికలతో జాప్యం

సాగునీటి సంఘాల ఎన్నికల విధుల్లో ఉండడంతో పనులు ఆలస్యమయ్యాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు గుడిసెవారిపల్లి చెరువుకట్ట విస్తరణ అభివృద్ధి పనులు ప్రారంభించాం. మట్టి పనులు కూడ జరిగాయి. రోడ్డు రోలర్ రాగానే పనులు ప్రారంభం అవుతాయి.

-శ్రీనివాసులురెడ్డి,
ఇరిగేషన్ ఇన్‌చార్జ్ ఏఈ

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా.. ఎమ్మెల్యే



బాధిత నాయకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి.

వాల్మీకిపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలకు అన్ని విదాలా అండగా ఉంటామని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వాల్మీకిపురం మండలంలోని గండబోయనపల్లె పంచాయతీలో వివిధ ప్రమాదాల్లో గాయపడిన టీడీపీ నాయకులను వారి వారి ఇళ్లకు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డితో ఎమ్మెల్యే కలిసి వెళ్లి పరామర్శిం చారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన యర్రావాండ్లపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు రమణయ్య ఇంటికి వెళ్లి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎగువమేకలవారిపల్లెలో పర్యటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకోవడం ద్వారా బాధితులకు వచ్చే ప్రమాద సొమ్ము అందేలా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమం లో పులి సత్యారెడ్డి,టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పీలేరు యోగా విద్యాలయం సందర్శన



'చుడా' చైర్‌పర్సన్ కటారి హేమలతను సన్మానిస్తున్న రాయల దంపతులు

పీలేరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(చుడా) చైర్‌పర్సన్ కటారి హేమలతకు శనివారం పీలేరులోని 'షీ' దివ్య యోగా విద్యాలయాన్ని సందర్శించారు. ఆమెను యోగా విద్యాలయం నిర్వాహకులు, పీలేరుకు చెందిన ప్రముఖ యోగా గురువులు రాయల లక్ష్మీ, ఆమె భర్త రాయల సుధాకర్ ఘనంగా సన్మానించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వేగంగా మరుగుదొడ్ల నిర్మాణాలు

పెద్దతిప్పసముద్రం నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా శనివారం ఎంపీడీవో అబ్దుల్ కలాం అజాద్, హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారితో కలిసి మండలంలోని బాగేపల్లె, కమ్మచెరువు, కుక్కలపల్లె, పిడుంవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుపై ఎమ్మెల్యే అభినందనలు



రామారావుకాలనీలో పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును బాగా చేసిన నాయకులను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అభినందించారు. శనివారం పట్టణంలోని రామారావుకాలనీలో క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు జాన్‌బాబు ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఇక్కడ 29, 3, 4 వార్డులకు సంబంధించిన నాయకులు ఇప్పటికే 12వందలకుపైగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేయడానికి కృషి చేయడంతో ఎమ్మెల్యే వారిని అభినందించారు. అంతకుముందే ఎమ్మెల్యేకు జాన్‌బాబు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కమలమరికృష్ణ, శ్రీనివాసులు, రెడ్డికుమార్, రెడ్డిబ్బా, మస్తాన్, రవి పాల్గొన్నారు.

తహసీల్దార్ వద్దంటూ టీడీపీ శ్రేణుల నిరసన

మదనపల్లె అర్బన్, నవంబరు30(ఆంధ్రజ్యోతి):అవినీతి తహసీల్దార్ వద్దని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం టీడీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్‌గా పని చేస్తున్న ఖాజాబీపై అవినీతి ఆరోపణలు మీడియాలో వస్తున్నట్లు వారు పేర్కొన్నారు. తహసీల్దార్‌కు నిరసనగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యర్రపల్లె వెంకటరమణారెడ్డి, డాన్స్‌రెడ్డెప్ప, కంచర్ల శ్రీనివాసులనాయుడు, బిల్డర్ రమణ, కోనభాస్కర్, లక్ష్మీపతి, నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి



ఉపాధ్యాయుడు దివాకర్‌ను సన్మానిస్తున్న హెచ్‌ఎం హేమలత

రామసముద్రం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని వక్తలు పేర్కొన్నారు. రామసముద్రం మండలం చెంబకూరు గ్రామ పంచాయతీలోని చెంబకూరు ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేసి పదవీ విరమణ చేసిన వి.దివాకర్ సన్మాన కార్యక్రమం వాసవీ కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. తూర్పు పాఠశాల హెచ్‌ఎం హేమలత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దివాకర్‌ను తోటి ఉపాధ్యాయులు, మిత్రులు, శ్రేయోభిలాషులు శాలువతో సన్మానించారు. ఈసందర్భంగా తనకు సన్మానం చేసిన వారికి ఉపాధ్యాయుడు దివాకర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు హేమలత, ఆంజనేయులు, యూటీఎఫ్ గౌరవ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, హెచ్‌ఎంలు చిట్టిబాబు, విష్ణుప్రియ, బాలసుబ్రహ్మణ్యం, దివాకర్ సతీమణి డి.సుబ్బలక్ష్మి, తల్లి వి.సుబ్బలక్ష్మి, సహచర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణల పరిశీలనకు కదిలిన అధికారులు

● బి.కొత్తకోటలో ప్రభుత్వ స్థలం గుర్తింపునకు శ్రీకారం



ఆక్రమణలు పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బి.కొత్తకోట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆక్రమణలు కొంతమేరకేనా? అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో శనివారం వెలువడిన కథనానికి జిల్లా యంత్రాంగం స్పందించింది. తక్షణం ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్, సబ్‌కలెక్టర్ ల ఆదేశాల మేరకు స్థానిక అధికార యంత్రాంగం కదిలింది. మండల తహశీల్దార్ మహమ్మద్ అన్సారీ ఎఫ్‌ఎంబీ చేతబట్టి, మండల సర్వేయర్ ముబారక్‌తో పాటు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలతో కలిసి పట్టణంలోని జ్యోతి సర్కిల్‌కు చేరుకొని ప్రభుత్వ స్థల హద్దులు గుర్తించే పనిలో పడ్డారు. నగర పంచాయతీ కమిషనర్ జీఆర్ పల్లవి, ఏవో రమాదేవిలు సైతం జ్యోతి చౌక్‌కు చేరుకొని తమ నగరపంచాయతీ కి చెందిన స్థలాన్ని తెలపాలని రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. అయితే వర్షం కారణంగా అంతరాయం కలిగింది. ఈ విషయమై తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ మాట్లాడుతూ బి.కొత్తకోట పట్టణంలోని రంగసముద్రం రోడ్డు, బెంగళూరు రోడ్డు, మదనపల్లె రోడ్డు, పీటీయం రోడ్డులతో పాటు, జ్యోతిచౌక్ లో రెవెన్యూ రికార్డుల మేరకు ఆర్‌అండ్‌బీ కి కేటాయించిన స్థలం ఎంత? ప్రస్తుతం మిగిలింది ఎంత... ఆక్రమణకు గురైనది ఎంత? అనే విషయమై సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

వర్షంతో స్తంభించిన జనజీవనం

పీలేరు, నవంబరు 30: ఫంగల్ తుఫాను కారణంగా కురిసిన వర్షానికి శనివారం పీలేరు మండలంలో జనజీవనం స్తంభించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆకాశం మేఘావృతం అయినప్పటికీ మధ్యాహ్నం నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో చాలా మంది తల్లిదండ్రులు వారి పిల్లలను స్కూళ్లకు పంపలేదు. . కొనుగోలుదారులు లేకపోవడంతో పీలేరు పట్టణంలోని దుకాణాలు వెలవెలపోయాయి. శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 27 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలియజేశారు.

కలకడలో:తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు శనివారం జనజీవనం స్తంభించింది. ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా పడుతున్న వర్షానికి ఈదురు గాలులు తోడయ్యాయి. దీంతో చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మండలంలో 1500 పైచిలుకు ఎకరాల్లో టమోటా పంట సాగైంది. పక్వానికి వచ్చిన కాయలను కోసి మార్కెట్‌కు తరలించేందుకు కూలీలు దొరకకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అలాగే పశువులను మేత కోసం పొలాల వద్దకు తోలుకపోయే అవకాశం లేకపోయింది. పాఠశాలకు హాజరైన విద్యార్థులు ఇళ్లకు చేరుకొనే సమయంలో అవస్థలు పడ్డారు. ప్రజలు తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఫణికుమార్ తెలిపారు.

దురాచారాలపై పోరాడిన మహనీయుడు గురజాడ

వాల్మీకిపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అంటరానితనం, కన్యాశుల్కం, బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు వంటి దురాచారాలపై తన రచనల ద్వారా రాజీ లేని పోరాటం చేసిన గొప్ప మహనీయుడు గురజాడ అప్పారావు అని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని చింతపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గురజాడ వర్ధంతిని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 19శతాబ్దంలోనూ, 20వ శతాబ్దం మొదటి దశకంలోనూ ఆయన చేసిన రచనలు ప్రజల మన్ననలు పొందాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రెడ్డెప్పరెడ్డి, ఉపాధ్యాయులు రమేష్‌బాబు, యుగంధర్, దామోదరం, సువర్ణాదేవి, సరిత, రమాదేవి, మునిరాజు, సుబ్బారెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సెలెక్టెడ్ ఎంపీటీసీలు రాజీనామా చేయాలి

● ఎంపీడీవో కార్యాలయం ఎదుట టీడీపీ శ్రేణుల నిరసన
● హాజరు కాని వైసీపీ ప్రజాప్రతినిధులు ● వాయిదా పడ్డ మండల సమావేశం



నిరసన తెలియజేస్తున్న టీడీపీ నాయకులు

ములకలచెరువు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య బద్ధంగా గెలవని ఎంపీటీసీలు సమావేశానికి వచ్చే అర్హత లేదని, పదవులకు రాజీనామా చేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఆ మేరకు ములకలచెరువు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం టీడీపీ శ్రేణులు నిరసన చేపట్టారు. ములకలచెరువు మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగేందుకు ఎంపీడీవో హరినారాయణ నిర్ణయిం చారు. దీంతో ప్రజాస్వామ్య బద్ధంగా గెలవని వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచులు సమా వేశానికి వచ్చే అర్హత లేదని ఉదయం 7 గంటలకే టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. దీంతో వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచులు సమావేశానికి హాజరు కాక పోవడంతో చివరకు సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో హరినారాయణ ప్రకటించారు. ఈ క్రమంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్య దర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ మాట్లాడు తూ ప్రస్తుతం ఉన్న వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచులు ఎలక్ట్ కాలేదని సెలక్ట్ అయ్యారని ప్రజాస్వామ్యంగా గెలివని ప్రజాప్రతినిధులు సమావేశానికి వచ్చే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నాయకులు భజంత్రి రామాంజులు, కట్టా హరినాథ్, నాగరాజు, మస్తాన్‌రెడ్డి, కేశవరెడ్డి, చాంద్ బాషా, శేఖర్‌నాయుడు, నీలకం ఠారెడ్డి, బుర్రారమణ, మూగి రవిచంద్ర, శ్రీనివాసు లు, రెడ్డెప్ప, సుబ్బనాయుడు, పాల రాము, ఎర్రంరెడ్డి, శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, దయ్యాల శ్రీనివాసులు, నారాయణ, రషీద్, మహిళా నేత గంగాదేవి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఒక రోజు ముందే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు



కొత్తిండ్లులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):మదనపల్లె నియోజకవర్గంలో ఒకటో తేదికన్నా ఒక రోజు ముందే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని వడ్డిపల్లె, కొత్తిండ్లు, రామా రావుకాలని, శివాజినగర్, గొల్లపల్లె ప్రాంతాల్లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఎమ్మెల్యే పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపీడీవో తాజ్‌మస్రూర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం సీటీఎం రోడ్డులో ఎస్టేట్ వద్ద రహదారి పనులు ఆలస్యంగా చేస్తుండటంపై ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

పెన్షన్లతో లబ్ధిదారులకు ఆత్మస్థైర్యం



లబ్ధిదారులకు పెన్షన్లను అందిస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

పెద్దతిప్పసముద్రం నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో లబ్ధిదారుల్లో ఆత్మస్థైర్యం నింపిందని తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక పీటీఎం లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, టీడీపీ నాయ కులతో కలిసి లబ్ధిదారులకు నేరుగా ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందించారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు కట్టా సురేంద్ర నాయుడు, స్థానిక సర్పంచ్ తమక శంకర, మాజీ ఎంపీటీసీ శేషాద్రి సురేష్‌బాబు, మడుమూరు యువనాయకుడు నవీన్, పాలగిరి రామాంజులు, రాము, భజంత్రి రామచంద్ర, మస్తాన్, కార్యం సుబ్రమణ్యం, శంకర, గంగులప్ప, సికిందర్ పాల్గొన్నారు.

వర్షంలోనూ 96 శాతం పింఛన్ల పంపిణీ

పీలేరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జోరు వానలోనూ పీలేరు మండలంలోని అధికారులు శనివారం 96 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. పీలేరు మండలంలోని 15 పంచాయతీల్లో 9748 సామాజిక భద్రతా పింఛన్లు ఉండగా శనివారం 9286 పింఛన్లు అందజేసినట్లు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. వర్షాన్ని సైతం లెక్కజేయకుండా లబ్ధిదారులకు పింఛన్లు అందజేసిన అధికారులను ఆయన అభినందించారు.

హార్సిలీహిల్స్‌లో నిర్మాణాలపై సమగ్ర విచారణ

బి.కొత్తకోట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ లో జరిగిన నిర్మాణాలు, స్థలాల ఆక్రమణ పై సమగ్ర విచారణ, సర్వే చేపట్టనున్నట్లు తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ ఆస్తులపై విచారణ చేయాల్సిందిగా తమకు ఆదేశాలు అందాయన్నారు. హార్సిలీహిల్స్‌లో సీడీసీఎంఎస్, బీఎస్ఎన్ఎల్, ఫారెస్ట్, పోలీస్, సిరికల్చర్ తదితర ప్రభుత్వ శాఖలతో పాటు, ప్రైవేటు వ్యక్తులూ నిర్మాణాలు చేపట్టారని వాటిపై విచారణ చేస్తామన్నారు. ప్రభుత్వం భూకేటాయింపులు చేసిఉంటే అందుకు తగిన పత్రాలు చూపాల్సి ఉంటుందని, లేనిపక్షంలో అది దురాక్రమణగా భావించి, నిర్మాణాలను తొలగించి భూమిని స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని తహశీల్దార్ వివరించారు.

యువజనోత్సవాల్లో మదనపల్లె విద్యార్థుల ప్రతిభ



జానపద పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతి గెలుచుకున్న జ్ఞానాంబిక విద్యార్థినులు

మదనపల్లె టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో రాయచోటిలో మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్‌రెడ్డి సమక్షంలో నిర్వహించిన యువజనోత్సవాల్లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ చూపారు. స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థినులు యువజనోత్సవాల్లో జానపద నృత్యపోటీల్లో పాల్గొని వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. వారిని యువజనోత్సవాల నిర్వాహకులు ప్రథమ బహుమతిగా రూ.7వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5వేలు నగదు అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, డాన్స్‌మాస్టర్ సురేష్ అభినందించారు. అలాగే స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని అమీనా వకృత్వపోటీల్లో ద్వితీయ బహుమతి సాధించింది. పెయింటింగ్‌లో చందన కన్సోలేషన్ బహుమతి గెలుచుకుంది. వారిని కల్చరల్ కోఆర్డినేటర్ హాజీరాఖానమ్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అభినందించారు.

పంచముఖ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కలకడ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):మండలంలోని బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలను జరిపారు. ఈ సందర్భంగా వేకువజామునే అభిషేకం, ఆకు పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి నైవేద్యం సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

బి.కొత్తకోట సీఐ బదిలీ

బి.కొత్తకోట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణ సీఐగా పనిచేస్తున్న కె.రాజారెడ్డి అన్నమయ్య జిల్లా స్పెషల్‌బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు కర్నూల్ రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ నుంచి శనివారం ఆదేశాలు వెలువడ్డాయి. బి.కొత్తకోట సీఐగా నియమితులైన అనతి కాలంలోనే బదిలీ కావడం విశేషం. కర్నూల్ రేంజీలో 26 మంది సీఐలకు స్థానచలనం జరిగింది. కాగా కె.రాజారెడ్డి స్థానంలో పులివెందుల అర్బన్‌స్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్న జి. జీవన్‌జగన్నాథ్ బాబు బి.కొత్తకోట సీఐగా రానున్నారు.

ఎయిడ్స్‌ను తరిమి కొడదాం



ములకలచెరువులో నిరసన తెలియజేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ములకలచెరువు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సమాజం నుంచి ఎయిడ్స్‌ని తరిమికొడదామంటూ ములకలచెరువులో శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. డిసెంబర్ 1వతేదీన ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత కళాశాల నుంచి ప్రదర్శన చేపట్టి అనంతరం బస్టాండు సర్కిల్‌లో మానవహారంగా నిలబడ్డారు. ప్రిన్సిపాల్ అల్తాఫ్‌బాను, ఎన్ఎస్ఎస్ పీవో శివరామయ్య, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, క్రిష్ణప్ప, నోములమ్మ, రాజవర్ధన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, శంకర్‌నాయక్, మహమ్మద్‌బాషా, కళావతి తదితరులు పాల్గొన్నారు.